# నీ భవిష్యత్తు గురించి ఆలోచించు

విలియమ్ మెక్‌డొనాల్డ్

అనువాదం: ఆర్. విజయుడు

Authentic™

HYDERABAD

*Nee Bavishyathu Gurinchi Aalochinchu*
(Telugu)

Think of Your Future
by William MacDonald

First Telugu edition 2014
ISBN: 978-93-83691-16-6

All rights reserved.
No part of this publication may be reproduced in any form or by any means, electronic, or mechanical, including photocopying, recording, or any information storage and retrieval system, without permission in writing from the publisher.

Published by
Authentic Books
Logos Bhavan, Suchitra Junction, Secunderabad 500 067, Andhra Pradesh.
www.authenticindia.in

Authentic Books is an imprint of Authentic Media, the publishing division of OM Books Foundation.

Printed and bound in India by
Authentic Media, Secunderabad 500 067

# విషయసూచిక


1. జీవితాలను మార్చే సత్యాలు .................................... 7
2. ఒకే ఒక్క జీవితం .................................... 10
3. ఎంతో అల్పమైనది .................................... 13
4. నిత్యత్వం .................................... 16
5. స్వర్ణయుగం .................................... 18
6. నిత్యత్వంలోనూ ఎన్నదగిన విద్య .................................... 22
7. నీ భవిష్యత్‌ను నీవే నిర్ణయించుకుంటావు .................................... 26
8. ఆశలు: వివేకవంతమైనవేనా? .................................... 29
9. జీవితపు గొప్ప నిర్బంధాలు .................................... 33
10. జీవితపు గొప్ప సమర్పణ .................................... 40
11. వృత్తి – దాని పాత్ర .................................... 45
12. సాకులు, నాటకాలు, నెపములు .................................... 51
13. తీవ్ర వాంఛతో కూడిన జీవితం .................................... 54

నేను మరణించు వేళ,
నా బ్రతుకు దీపం నీ కొరకే ప్రజ్వరిల్లినందుకు
నేనెంత సంతోషిస్తానో.

ఒక పాపిని రక్షించుటకు నేనేమిచ్చినా,
ధనమైనా, ప్రయాసమైనా నాకు సంతోషమే;
మార్గమెంత కఠినమైన పర్వాలేదు,
నీ ప్రియ పాదాలు దారి చూపించాయి అంతేచాలు.

నేను మరణించు వేళ,
నా బ్రతుకు దీపం నీ కొరకే ప్రజ్వరిల్లినందుకు
నేనెంత సంతోషిస్తానో

-సెలెక్టెడ్

# జీవితాలను మార్చే సత్యాలు

ఓ గొప్ప సత్యం తరచుగా ఒక మనిషి జీవిత గమనాన్నే మార్చివేస్తుంది. యేండ్ల తరబడి అతడు అలవాటుగా తన జీవితాన్ని కొనసాగిస్తుండవచ్చు; అప్పుడు, అకస్మాత్తుగా, ఓ ప్రేరణాత్మక పదమో లేదా వాక్యమో అతనికి తారసపడుతుంది. ఆ రోజునుండి అతని జీవితం మునుపటిలా ఉండదు. అతని జీవిత దిశ మొత్తం పూర్తిగా మారిపోతుంది.

హడ్సన్ టేలర్ విషయంలో అదే జరిగింది. ఊరకే తన తండ్రి గ్రంథాలయంలో ఏదో వెదకుతుండగా,"సంపూర్తి చేయబడిన క్రీస్తు జీవితము" అనే మాటలు అతని కంటపడ్డాయి. ఆ సత్యం అతన్ని పట్టుకుంది; క్రీస్తు కార్యమును ముగించినట్లైతే, ఇక తాను చేయడానికి మిగిలిందేమీ లేదు- రక్షకుని విశ్వసించటం తప్ప. అతని ఆత్మలో వెలుగు సమాధానము పొంగి పొర్లాయి. కొన్ని సంవత్సరాల పిమ్మట చైనా దేశంలో సువార్త ప్రకటించుటకై వెళ్లాడు.

కౌంట్ జింజెన్‌డార్ఫ్ విషయంలోనూ అలాగే జరిగింది. అతడు యౌవనస్థుడుగా జర్మనీలో ఉన్నప్పుడు, ఒకరోజు క్రీస్తు సిలువ చిత్రపటం ఎదుట నిలబడ్డాడు. ఆ చిత్రం దిగువభాగంలో ఈ మాటలున్నాయి:

*"ఇదిగో! ఇదంతా నీ కొరకే చేశాను."*

జింజెన్‌డార్ఫ్ ఆ సత్యం చేత బహుగా కదలింపబడ్డాడు, పిమ్మట యేసు క్రీస్తును తన రక్షకునిగా స్వీకరించాడు.

అతడు మళ్ళీ చూడగా ఆ చిత్రపటం దిగువన ఇంకా కొన్ని పదాలను గమనించాడు:

"మరి నీవు నా కొరకేమి చేశావు?"

ఈ తీక్షణమైన ప్రశ్న ద్వారా కదల్చబడి తన జీవితాన్ని ప్రేమతో క్రీస్తునకు సమర్పించాడు. ఈ రోజున మొరేవియన్ మిషనరీ ఉద్యమ చరిత్రలో అతని పేరు పరిమళ వాసనగా ఉన్నది. డ్వైట్ యల్. మూడి విషయంలోనూ అదే జరిగింది. అతడు ఇంగ్లాండ్ నందు సువార్త సభ ముగించి, సుప్రసిద్ధ ఆంగ్ల వాక్యోపదేశకుడైన హెన్రీ వార్లేకి వీడ్కోలు చెబుతున్నాడు. ఆ సమయంలో వార్లేగారు మూడీతో ఒక చురుకైన మాట అన్నాడు: "మిస్టర్ మూడీ, దేవుని చిత్తాన్ని జరిగించడానికి సంపూర్ణంగా తన్నుతాను అప్పగించుకొన్న వ్యక్తి ద్వారా దేవుడు ఏమిచేయనైయున్నాడో దానిని ఈ ప్రపంచం ఇంకా చూడాల్సి వుంది." ఈ గంభీరమైన మాటలను మూడీ తన మనసులో నుండి తొలగించుకోలేకపోయాడు; ఆ మాటలు అతన్ని వెంటాడాయి.

"తాను ఇంటిముఖం పట్టి వెళ్తుండగా ఆ మాటలు తన ఎదుట నున్న సముద్ర తరంగాలపై వ్రాయబడినట్టు భావించాడు, తను న్యూయార్క్ వీధుల్లో నడుస్తుండగా దారి పొడుగునా ఆ మాటలే కనిపించసాగాయి, చికాగోకు రైలులో ప్రయాణిస్తుండగా ఆరు బయట మైదానంలో కూడ ఆ మాటలే అగుపించాయి". తన శేష జీవితంపై అమాటలు ఎంత ప్రభావాన్ని చూపాయనగా, నేటి రోజున ఆయన చేసిన పనీ, దాని ప్రభావమూ వాటికవే సాక్షీభూతంగా నిలిచాయి.

వందలాదిగా అనేకులు ఇదే కథను చెబుతారు. వారు నిర్లక్ష్యంగా తమ జీవితపు అడుగులు వేస్తుండగా, అకస్మాత్తుగా గొప్ప వ్యక్తులలో దాగియున్న సత్యాన్ని వారు గమనిస్తారు. వారు దాని తర్కం చేత లేక భావావేశం చేత పట్టబడతారు. అది వారి మనసులను హృదయాలను దహించి వేస్తుంది. ఆ తరువాత వారు మునుపటి వలె ఉండరు. గొప్ప దర్శనం ద్వారా ప్రేరణ నొందినవారై, ముందుకు సాగి దేవుని కొరకు చరిత్రను సృష్టించారు.

అది మనకూ సంభవించవచ్చు! సత్యం నిత్యమైనది, గొప్ప వ్యక్తులను విప్లవాత్మకంగా మార్చిన ఆ వ్యాఖ్యలే ఇతరులను వారి మజ్జుతనము నుండి మేల్కొలిపి ఇహమందును నిత్యత్వమందును విజయాన్ని తప్పక చేకూర్చగలవు.

మనం ఇష్టపడితేనే! నిదానించి సహనంతో వినడానికి మనం ఇష్టపడితేనే! యథార్థంగాను ధైర్యంగాను ఈ సత్యాలను ఎదుర్కొనుటకు మనం ఇష్టపడితేనే! వాటిని తార్కికంగా సవివరంగా ఆలోచించుటకు ఇష్టపడితేనే! వాటివలన కలుగు ఫలితాలను ఆలోచించి, వాటికనుగుణంగా తగువిధంగా స్పందించి, వాటిని వెంటాడుటకు మనం ఇష్టపడినట్లయితేనే!

ప్రతిదీ దానిపైనే ఆధారపడివుంటుంది! మహిమాన్విత దర్శనమును వెంబడించేందుకు మనం సిద్ధంగా ఉన్నామా? తక్కిన పేజీలు చదవకమునుపు, మనమీ దిగువ ప్రశ్నలకు దేవుని సన్నిధిలో ఉన్నామా అన్నట్లు సమాధానమివ్వాలి:

*ప్రభువు నాతో మాట్లాడుటకు నేను ఇష్టపడుతున్నానా?*
*బేషరతుగా నేనాయనకు లోబడతానా?*
*ఆయన కొరకై నేను విడిచిపెట్టుటకు ఇష్టపడనిదేదైనా ఉన్నదా?*

# ఒకే ఒక్క జీవితం

ఈ భూమి మీద మన ఉనికి గురించి ఆలోచించే ప్రయత్నమేదైనా మనము చేసినపుడు మనమిక్కడ జీవించేది ఒకే ఒక్కసారి అన్న గుర్పాటు కలిగించే గ్రహింపును మనం పరిగణలోనికి తీసుకోవాల్సిందే. అలాంటప్పుడు మనమీ తీక్ష్ణమైన నిశ్చయతతోనే ఆరంభించుదాం:

## ఒకే ఒక్క జీవితం

ప్రభువైన యేసు జీవితంలోని అత్యంత ప్రేరణాత్మక శక్తులలో ఇది ఒకటి అన్న విషయం యోహాను 9:4లో ఆయన పలికిన మాటల్లో స్పష్టంగా తెలుస్తోంది:

> పగలున్నంత వరకు నన్ను పంపినవాని క్రియలు మనము చేయవలెను; రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు.

"పగలున్నంతవరకు". "రాత్రి వచ్చుచున్నది." "ఒకే ఒక్క జీవితం."

మనము మరచి పోకుండ ఈ మాటలు మన అంతరాత్మలో ఎఱ్ఱగా కాలే ఇనుప కడ్డీతో వ్రాయబడితే ఎంత బావుంటుంది. ఒక్క జీవితం! ఒకే ఒక్క జీవితం! ఎంత చెప్పశక్యము కాని గంభీరమైన సత్యమో!

ఆ జీవితం ఎంత విలువైనదో కూడ మనం ఆలోచించాలి! నా జీవితం నాకెంత విలువైనది? దాన్ని ఎంత సొమ్ముకు నేను మారకం వేయగలను? అది విస్తారమైన విలువ గలది గనుక నిజానికి మనలో ఎవ్వరూ దానికి వెలకట్ట లేరు.

మనము జీవితపు సాధ్యతల గురించి కూడ ఆలోచించాలి! ఈ లోకంలో పుట్టిన ప్రతి బాలుడు ఓ యోహాను లేదా యిస్కరియోతు, ఒక పౌలు లేదా పిలాతు కావచ్చు! మంచికైనా చెడుకైనా, ఫలములు ఫలించుటకైనా వ్యర్థతకైనా, సంతోషమునకైనా దుఃఖమునకైనా అవధులు లేనన్ని అవకాశాలున్నాయి.

ఈ సత్యాలు మనల్ని పట్టుకున్నప్పుడు జీవితం ఓ పవిత్రమైన నిధియని, దాన్ని వ్యర్థంచెయ్యక, వీలైనంత శ్రేష్టమైన రీతిలో ఉపయోగించాలని గ్రహిస్తాం.

*"మనిషి కాలాన్ని వృథాచెయ్యరాదు; జీవితం స్వల్పమైనది*
*పాపం ప్రక్కనే పొంచివున్నది. మన వయస్సు రాలే ఆకు వంటిది,*
*జారిపడే కన్నీటి బొట్టు వంటిది.*
*గంటలను దుర్వినియోగం చేసేంత సమయం మనకు లేదు;*
*మనలాంటి లోకంలో అంతా మనఃపూర్వకంగా ఉండాలి.*
*మనకున్నది ఎన్నో కాదు, ఒక్కటే జీవితం–*
*ఒక్కటే, ఒకే ఒక్కటి; ఎంత దివ్యంగా ఉండాలి ఆ ఒక్క జీవితం–*
*ఆ కొద్ది కాలం!*
*ప్రతిదినము నిండివుంటుంది ధన్యకరమైన శ్రమతో,*
*ప్రతి ఘడియకూ ఇంకా కొత్త కొల్లసొమ్మును కొనితెస్తూ.*

–హోరేషియస్ బొనార్

"ఎన్నో కాదు"! "ఒక్కటే, ఒకే ఒక్కటి"! "ఆ కొద్దికాలం"!

ఈ ఒక్క జీవితం ఎంత దివ్యమైనదో తెలపడానికి సి.యి.టథామ్ సాధారణంగా ఉపయోగించే ఒక దృష్టాంతాన్ని ఇది మనకు గుర్తుచేస్తోంది. ఓ చిన్న అమ్మాయి తన తల్లితో షాపింగ్‌కు వెళ్ళగా, సరుకులన్నీ కొనడం అయిపోయాక, ఓ చాక్లెట్ కొనుక్కోమని చెప్పింది తల్లి. అద్దాల పెట్టెలో వేర్వేరు తీపి పదార్థాలుంటే అవి ఒకదానికంటే ఒకటి ఆకర్షణీయంగా కనిపించాయి. ఆ అమ్మాయి వాటినే చూస్తూ నిలబడిపోయింది. మొదట ఒక స్వీట్‌ను చూపిస్తూ "నాకు అది కావాలి" అని చెప్పింది. ఆ దుకాణ దారుడు దాన్ని తీసి ఇచ్చే లోగా తన మనసు మార్చుకొని 'కాదు, కాదు ఆ ప్రక్కన స్వీట్' అని చూపించింది. అలా రెండు మూడుసార్లు చూసి తల్లి విసిగిపోయి, "త్వరగా కానివ్వవే" అని మందలించింది. అందుకా పాప "కానీ, అమ్మా, త్వరగా కానివ్వడానికి నా దగ్గర ఉన్నది ఒకే ఒక్క రూపాయి" అంటూ తెలివైన తర్కంతో బదులిచ్చింది.

"ఒకే ఒక్క రూపాయి! "ఒకే ఒక్క జీవితం" దాన్ని తెలివిగా ఖర్చుపెట్టడం మరువకు!

ఈ సంగతి మనకు పదే పదే జ్ఞాపకం చేయబడాలి. ఇందుకోసమే కీర్తిశేషులు బ్రిటన్ దేశపు రాజైన జార్జ్–5 తన బల్లపై ఓ నినాదాన్ని ఉంచుకొనే వాడు. పంతొమ్మిదవ శతాబ్దపు క్వేకర్ సభ్యుడైన స్టీఫెన్ గ్రెల్లెట్‌చే వ్రాయబడిన ఆ మాటలు ఇలావుండేవి:

> ఈ లోకంగుండా నేను వెళ్లగలిగేది ఒక్కసారే. కాబట్టి నేను చేయవలసిన మంచి కార్యమేదైనా ఉంటే లేదా ఏ మనిషికైనా దయచూపవలసియుంటే అది ఇప్పుడే చేయనివ్వు. ఈ త్రోవగుండా నేను మళ్ళీ వెళ్ళను గనుక నేను దానిని చేయకుండ మానుకోవడమో, అశ్రద్ధచెయ్యడమో జరగకుండ చూడు.

ఈ భూమి మీద జీవితం ఎంత క్షణికమైనదో అవిస్ బి.క్రిస్టియన్‌సన్ తన కవితలలో ఎంతో చక్కగా వర్ణించాడు:

> యేసయ్యా, నా ప్రభూ నా రాజా, నీకర్పించుటకు ఒకే ఒక్క జీవితం; నిన్ను కీర్తించి నీ కరుణను కొనియాడుటకు ఒకే ఒక్క నాలుక; నీ యెడల భక్తిని కనపరిచేందుకు ఒక్కటే హృదయం– ఓ రక్షకా! నీకు మాత్రమే లోబడి నీ ఎనలేని మహిమకు మాత్రమే అవి సమర్పింపబడును గాక.
>
> ఈ ఘడియ మాత్రమే నాది ప్రభూ; అది నీ కొరకే వాడబడునుగాక; గతించు ప్రతి క్షణము నిత్యత్వము నిమిత్తమై గడుపుదును గాక; ఎటుచూసినా ఆత్మలు మరణిస్తున్నాయి, పాపములో, అవమానములలో మరణిస్తున్నాయి; వాటికి నీ దివ్యనామంలో కల్వరియొక్క విమోచన వర్తమానము అందించుదును గాక.
>
> అర్పించుటకు ఒకే ఒక్క జీవితం; అర్థిస్తున్నాను ప్రియ ప్రభువా, స్వీకరించు; నీ యొద్దనుండి ఏదీ దాచుకొనక, నీ చిత్తమునకే లోబడుదును; నీ సర్వస్వమును నాకు ఉచితముగా అనుగ్రహించితివే, నా రక్షకా, ప్రతి క్షణము నీ కొరకే వాడబడుటకై నా జీవితమును నీ సొంత చేసుకో.

అలాగైతే, జీవితాన్ని మార్చే ఈ గొప్ప సత్యాన్ని, **ఒకే ఒక్క జీవితం** అనే ఈ తొలి సత్యాన్ని ధీమాగా ఎదుర్కొందాం. దాని వెలుగులో చూచినప్పుడు మన ఆశలు అభిలాషలు యోగ్యమైనవిగా ఉన్నాయో లేదో మనలను మనము యథార్థంగా ప్రశ్నించుకుందాం.

# ఎంతో అల్పమైనది

**జీ**వితం యొక్క ఏకత్వాన్ని (ఒకే ఒక్క జీవితం) పరిగణలోనికి తీసుకుంటేనే ఇంత ఆశ్చర్యంగా ఉంటే, ఇక ఆ జీవితం ఎంతో అల్పమైనది అన్న నిష్ఠుర సత్యాన్ని మరింత లోతుగా ఆలోచిస్తే అది మనల్ని ఇంకెంత నిర్ఘాంతపరుస్తుందో కదా. ఆ జీవితం ఓ వెయ్యేండ్ల పాటు లేదా ఐదు వందల యేండ్ల పాటు లేదా రెండు శతాబ్దాల పాటు పొడిగించబడినట్లైతే, మనకున్నది ఒకే ఒక్క జీవితం అన్న వాస్తవం మనలో అంత అత్యవసరతను రేకెత్తించదు. అయితే, నేటినుండి మొదలుకుని వచ్చే వందేళ్లపాటు మనలో ఎవ్వరిమీ బ్రదుకమని, మనలో చాలామంది కనీసం అందులో సగం రోజులు కూడ బ్రదుకమని గ్రహించాక, అది త్వరగా గతించిపోతుందన్న వాస్తవంతో చలించని వారెవరుంటారు చెప్పండి!

నువ్వు ఎంతకాలం బ్రతుకుతాననుకుంటున్నావు? బైబిల్‌లో తలంచబడిన సగటు ఆయుష్షు డెబ్బైయేండ్లు (కీర్తన 90:10). సరే, నువ్వు నిజంగా అంతకాలం బ్రదుకుతావనే అనుకుందాం! అందులోనుంచి నీ ప్రస్తుత వయస్సును తీసివేయాలి. అవి తీసివేయగా మిగిలిన కాలమే నువ్వు బ్రతికేది. అయితే ఇందులోనుంచి కూడ నీవు నిద్రలో గడిపే సమయం, ఉద్యోగం, అనుదిన కార్యక్రమాలు, అనారోగ్యం, అశక్తత మున్నగు వాటిలో గడిపే సమయాన్ని తీసియేయాలి. ఇక యేసుక్రీస్తు సేవకోసం నిరాటంకంగా ఎటువంటి బాదరబంది లేకుండ గడపగలిగే సమయం ఎంత మిగిలింది? జవాబు ఏమిటంటే, "అంత ఎక్కువేమి లేదు!"

జీవితం ఎంత సంకుచితమైనదో వివరించడానికి లేఖనాలు తెలుగు భాషలో ఉన్న పదాలన్నిటినీ ఉపయోగించాయి.

మోషే దానిని నిద్రతో పోల్చాడు.
దావీదు దానిని ఓ నీడ అంటున్నాడు.
యోబు దానిని నేతగాని కండెతో సమానం చేశాడు.
యాకోబు దానిని నీటిబుడగగా భావిస్తున్నాడు.
పేతురు దాన్ని వాడిపోయే గడ్డిలా చూస్తున్నాడు.

త్వరగా, అవిశ్రాంతంగా, మిలమిల మెరిసే దాని అవకాశాలతో అది వస్తుంది, పోతుంది.

నా శాశ్వత నివాసమిక్కడే అనే మన నిర్లక్ష్య వైఖరిని చూసి, శవాల గది, పీనుగుల బండి, సమాధులతోట మనల్ని వెక్కిరిస్తున్నాయి. "ఉయ్యాల మంచం, శవపేటికా రెండూ ఒకే చెట్టునుంచి చెక్కబడినవేనని గుర్తు చెయ్యకుండ ఒక్కరోజయినా గడవదు సుమా."[1]

క్రైస్తవుని జీవిత గమ్యం మరణం కాక, ప్రభువు రాకడే అయినట్టైతే, జీవితము అనిశ్చయమైనది అనే వాదన మరింత బలపడుతుంది. మనలో కొంతమంది వారు మరణించడానికి ఇంకా కొన్ని దశాబ్దాల సమయముందని ఆశిస్తుండవచ్చు, కాని అందులో, రక్షకుని రాకడకు సూచనగా వినబడు ఓ కేక, స్వరము, దేవుని బూర వినబడకుండ నిరాక్షేపంగా గడపగలిగే ఒక్క గంటయినా ఉండదు. రాజకీయ పరిణామాలు, నైతిక పతనం మున్నగునవి ప్రవచనాత్మక వాక్యంతో కలిసి ఆయన ఏ క్షణమైనా ప్రత్యక్ష్యము కావచ్చునని సెలవిస్తున్నాయి.

దీనంతటి భావమేంటి? క్లుప్తంగా చెప్పాలంటే– దేవుని కోసం జీవించాలనే తలంపులు కలిగిన వారికి వ్యర్థం చేసేందుకు సమయం లేదు. అట్టి వ్యక్తి ప్రతి క్షణాన్ని ఓ పవిత్రమైన సొత్తుగా భావించాలి. ప్రతి ఘడియను అనంతమైన విలువగలదిగా చూడాలి. నేను శీఘ్రమే క్రీస్తు న్యాయపీఠం ఎదుట నిలువ వలసియున్నదనే భావన కలిగి ప్రతిదినము గడపాలి.

"ఫిలిప్, నువ్వు తప్పకుండ చనిపోతావు గుర్తుంచుకో!" అంటూ ఓ బానిసపిల్ల ప్రతిరోజూ మాసిడన్ వాడైన ఫిలిప్‌తో చెప్పింది. ప్రతిదినమూ అతడు తప్పించుకోలేని ఆ వాస్తవపు వెలుగులోనే జీవించాడు.

మనం కూడ, “నశించుచున్న మంటిఘటములమని, కొద్దికాలముకొరకే పుట్టామని” ప్రతి ఉదయము పరిశుద్ధాత్ముడు మనకు జ్ఞాపకం చేస్తాడు. మనం కూడా, మన జీవితాలను నిత్యత్వపు వెలుగులోనే జీవించాలి.

ఈ ఘడియల విలువను తెలుసుకొనుటకు నాకు సహాయం చేయుము,
సమస్త వ్యర్థత ఎంత బుద్ధిహీనమైనదో చూచుటకై సహాయం చేయుము;
నా వ్యసనములను భరించిన క్రీస్తును నమ్ముటకై సహాయం చేయుము,
జీవమైన మరణమైన ఈ విషయమై నీకు లోబడుటకు సహాయం చేయుము.
ప్రభువైన యేసూ, నా దినములన్నిటిలోను మహిమపరచబడుము,
నా మార్గములన్నిటిలోను నీ కనుదృష్టితో నన్ను నడిపించుము;
ప్రభువైన యేసూ, నీ చిత్తము చొప్పున నన్ను ఎప్పుడు వాడుకుంటావో,
అప్పుడు నాకు జీవమైనా మరణమైనా క్రీస్తుకొరకే అనిపిస్తుంది. [1]

నేటి కొరకు-రేపటి కొరకు-రాబోవు దినముల కొరకు నీ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

*మరి ఆ తరువాత?*

# నిత్యత్వం

కాలము యొక్క అల్పత్వమే ఒక సంపూర్ణ వాస్తవమైతే, అంతులేని నిత్యత్వం ఇంకెంత విస్తుగొలిపేదిగా ఉంటుందో. నిత్యత్వపు శాశ్వతత్వాన్ని భాషలోని కొన్ని పదాలతో గ్రహించడం కష్టమే అవుతుంది. దీని అంతుచిక్కనితనం అర్థం కావాలంటే లోకం పుట్టకమునుపు ఉన్న కాలానికి వెళ్లాలి, ఆ తర్వాత దేవదూతలు సహా సృష్టించబడక మునుపు, అనగా దేవుడు తప్ప ఇంకెవరూ, ఏదీ లేని కాలం వరకు వెళ్ళు. అక్కడి నుంచి ఇంకా వెనక్కి వెళ్లి మొదటినుండి ఉన్న ఆరంభరహిత కాలం వరకు వెళ్లు. ఇంకా, ఇంకా, ఇంకా వెనక్కి వెళ్లి చూడు. దేవుడు అన్నివేళలా ఉన్నాడు. ఆయన ఉనికికి ఆరంభమే లేదు.

ఆ తరువాత నీ మనసును మున్ముందుకు భవిష్యత్తులోనికి దూసుకెళ్ళనివ్వు- ఈ భూమి నాశనము చేయబడ్డాక, పాపము కనుమరుగయ్యాక, సమయము ఆగిపోయాక, ముందుకు మున్ముందుకు వెళ్ళి ఆలోచించు. అంతము లేదు, అంతమసలే లేదు.

దీనిగురించి ఆలోచించడం ఇక చేతకాక నీ బుర్ర వేడెక్కిపోతుండగా, ఒక విషయం గుర్తుంచుకో- నీవు నిరంతరమూ జీవించబోతున్నావు. ఎన్నటెన్నటికీ, సదాకాలము అంతము లేని జీవితం జీవించబోతున్నావు!

నిత్యత్వము!

దాని భావాన్ని ఒడిసిపట్టుకునేందుకు మనుష్యులెంతగా ప్రయత్నించారో! ఆ భావాన్ని పూర్తిగా వర్ణించలేకపోయినా, హెంద్రిక్ వాన్ లూన్ ఈ దిగువ మాటల్లో ఓ చక్కని దృష్టాంతాన్ని అందించాడు:

ఉత్తర ప్రాంతమందలి ఎగువ భాగాన ఓ రాయి ఉండేది.

అది వందమైళ్ళ ఎత్తు, వంద మైళ్ళ వెడల్పు గలది. వెయ్యేళ్లకోసారి ఓ చిన్న

> పక్షి వచ్చి ఈ రాతి సహాయంతో తన ముక్కును పదునుపెట్టుకునేది. ఆ విధంగా ఆ రాయి అరిగిపోయేనాటికి నిత్యత్వంలో ఒక్కరోజు గడిచి వుంటుంది.[1]

రోలండ్ డిక్సన్ ఎడ్వర్డ్స్ నిత్యత్వాన్ని ఇలా వర్ణించేందుకు ప్రయత్నించాడు:

> స్టీమర్ ఎక్కి సముద్రంలో ప్రయాణించేటపుడు ఓ చిన్న మూత తీసుకొని దానికి దారం కట్టి సముద్రపు నీటిలోనికి విడచి ఆ మూత నిండ సముద్రపు నీరు తోడాలి. ఇది నిత్యత్వమను సముద్రమునుండి తీయబడిన సమయానికి సాదృశ్యముగా ఉంటుంది.
>
> నిత్యత్వమనేది తీరంలేని మహాసముద్రంవంటిది.
>
> అది అంతము లేని కాలం.
>
> అది సదా మన ఎదుట నిలిచే ఓ క్షణం కాలం.
>
> అది దేవుని జీవితకాలం.
>
> ఈ భావన యొక్క బరువు క్రింద మాటలు సహా మూల్గుతున్నాయి.

ఈ జీవితము అవధులు లేని నిత్యత్వపు తీరంలోని ఓ ఇసుక రేణువు అన్న నిష్ఠుర సత్యాన్ని ఒప్పుకోలేని మనిషి తాను హేతుబద్ధమైన వ్యక్తినని చెప్పుకోలేడు. తన జీవితము యావత్తు దీని వెలుగులో నిర్మించబడాలి. నిత్యత్వపు విలువలను దృష్టిలో పెట్టుకుని అతడు బ్రతకాలి.

మిలన్‌లోని కేథడ్రల్‌లో మూడు మడతల తలుపులు ఉండేవట. మొదటి మడతపై ఓ రోజా పూల గుచ్చమూ, దానిమీద ఈ మాటలు చెక్కబడినాయి: "మనకు నచ్చినదంతా క్షణికమే". మూడవ మడతపై సిలువతోపాటు ఈ పదాలున్నాయి: "మనల్ని బాధించే కష్టాలన్నీ క్షణికమే". మధ్యలో ఉన్న తలుపు మీద ఓ గమనిక ఉన్నది, "కేవలం నిత్యత్వమే ప్రాముఖ్యం".

అలాగైతే, క్రైస్తవులమైన మనము, నిత్యత్వమనే వాస్తవికతను గ్రహించే ప్రయత్నం చెయ్యాలి. ఈ నిర్ఘాంతపరచే వాస్తవాన్ని మనము ఏకాంతంగా ముఖాముఖీ కలుసుకోవాలి. అప్పుడు మనము ముందుకు వెళ్తుండగా, మన కళ్లల్లో ఓ వింతైన మెరుపు, హృదయంలో మన ప్రణాళికలు ఈలోకంలోనే అంతమైపోవనే దృఢ సంకల్పం కలుగుతాయి. గనుక మనము ఇప్పటికోసం గాక, నిత్యత్వం కోసమే జీవిస్తాం!

# స్వర్ణయుగం

జీవితపు సంగతులను యథార్థంగా ఎదుర్కొనగోరు యౌవనస్థులు, యౌవనమే అన్నిటికన్నా స్వర్ణయుగమని గుర్తించాలి. ఆ వయస్సులోనే మనిషి శక్తిసామర్థ్యాలు అత్యధికంగా, గ్రహణశక్తి చురుకుగా, ఆసక్తి నిండుగా ఉంటాయి.

దేవుడు యువత పట్ల ప్రత్యేక ప్రేమను కలిగియున్నాడన్న విషయాన్ని ఈ వచనం ద్వారా తేటగా గ్రహించవచ్చు. "...నీవు అరణ్యములోను, విత్తనములు వేయదగని దేశములోను, నన్ను వెంబడించుచు నీ యౌవనకాలములో నీవు చూపిన అనురాగమును నీ వైవాహిక ప్రేమను నేను జ్ఞాపకము చేసికొనుచున్నాను" (యిర్మీయా 2:2).

యౌవనకాలానికి ఏదో ప్రత్యేకత ఉంది! సహజంగా చూచినట్లైతే, ముదికిగా ఉన్న పిల్లికంటే చెంగు చెంగున గంతులేసే పిల్లి పిల్లతోనే ఆడుకోటానికి ఇష్టపడతాం. కుంటుతున్న ఆడ గుర్రంకంటే పచ్చగడ్డిలో మేస్తున్న ఓ గాడిద పిల్ల మన దృష్టిని ఆకర్షిస్తుంది. నీవు ఎక్కడికెళ్ళినా చంటి పిల్లలంటే ఇష్టపడి వీరు ముసలివాళ్లు కాకుండ ఇలానే ఉండిపోతే ఎంత బాగుండునని మనస్సులో ఎక్కడో ఆశిస్తావు.

ఆత్మీయంగా చూచినట్లైతే, ఉప్పొంగే యువత, గాఢమైన వారి తొలి ప్రేమపట్ల దేవుడు ప్రత్యేక ఆసక్తి కలిగియున్నాడు. యౌవనస్థుల ఆసక్తి, బలము, సాహసము అంటే దేవునికెంతో ఇష్టం. ఆయన వారి చెప్పనలవి కాని భక్తి శ్రద్ధలను క్రమశిక్షణ పట్ల వారికున్న ప్రగాఢ వాంచను మరియు ఇష్టపడి తమను తాము ఆయనకు సమర్పించుకొనుటను జ్ఞాపకము చేసికొంటాడు. "నీ యౌవన కాలములో నీవు చూపిన అనురాగమును నీ వైవాహిక ప్రేమను నేను జ్ఞాపకము చేసికొనుచున్నాను."

ఏదైనా సాధించగలిగే వయస్సు యౌవనం. ముప్పైఏళ్లు రాక మునుపే "వర్జిల్ లాటిన్ కవులకు ప్రేరణ అయ్యాడు, లూథర్ సంఘ పునరుజ్జీవ సైన్యములను నడిపించాడు. న్యూటన్ పరిశోధకులందరికంటే ముందు వరుసలో నిలిచాడు. ఇరవై ఎనిమిదేండ్ల లోపే, హెరోడోటస్ తన తొమ్మిది చరిత్ర గ్రంథాలను ఒలింపిక్ ఆటల సమయంలో వల్లించగా, హ్యానిబాల్ స్పెయిన్‌ను కార్తేజ్ హస్తగతమయ్యేలా చేశాడు. ఇరవై ఐదేండ్ల వయస్సులో డెమొస్తెనెస్ గ్రీస్ యొక్క ముఖ్య వక్తగా ఉండగా, సిసెరో రోమ్‌యొక్క ప్రధాన వక్త అయ్యాడు! అదే వయస్సులో రఫాయేలు తన చెరగని చిత్రకళతో వాటికన్‌ను అలంకరించవలసిందిగా జూలియస్-2 ద్వారా ఆజ్ఞాపింపబడ్డాడు. గెలీలియో కనుగొనబడవలసియున్న నక్షత్రాలను ప్రకాశించే ఆకాశంలో చూశాడు! అదే వయస్సులో షేక్స్‌పియర్ నాటక రచయితలకు నాయకుడయ్యాడు! ఇరవై రెండేళ్ల ప్రాయంలో అలెగ్జాండర్ పర్షియాను ఓడించగా, నెపోలియన్ వాషింగ్టన్‌లు కాకలు తీరిన సైనిక యోధులయ్యారు. ప్లేటో తన ఇరవైయవ యేట సోక్రటీస్‌యొక్క మిత్రునిగాను, సమకాలికునిగాను మారి, అరిస్టాటిల్‌ని తన పదిహేడవ ఏట 'ద మైండ్ ఆఫ్ హిజ్ స్కూల్'గా పిలిచాడు. పాస్కల్ పంతొమ్మిదేళ్లకే గొప్ప గణితశాస్త్ర నిపుణుడు కాగా, బేకన్ చిరుప్రాయంలోనే తన తత్వశాస్త్రమునకు పునాదులు వేశాడు. ఇరవై ఐదవ యేట జోనతన్ ఎడ్వర్డ్స్ మరియు జార్జ్ విట్‌ఫీల్డ్ ప్రసంగ చక్రవర్తుల జాబితాలో చేరారు, యేసు క్రీస్తు తన ముప్పైవ యేట ప్రపంచాన్ని ప్రకంపింపజేసే తన సువార్తను ప్రకటించాడు."

ముసలితనం వచ్చే సరికి మన శ్రేష్టమైన బలమంతా ఉడిగిపోయి వుంటుంది. చేతులు వణకటం ప్రారంభిస్తాయి, శరీర బరువునుబట్టి కాళ్ళు వంకర్లు తిరుగుతాయి. బహుశా దంతాలు కొన్నే మిగిలివుంటాయి, కనుచూపు తగ్గిపోయి వుంటుంది. చెవులకు వినికిడి యంత్రం అవసరమవుతుంది, నోటిమాట తడబడుతుంది. వృద్ధాప్యంతో పాటు బద్ధకము, పిరికితనము, ఆకలి మందగించుట, అలసిపోవుట మున్నగునవి వస్తాయి. వృద్ధాప్యము అలసటను కలిగిస్తుంది.

అలాగైతే, ప్రసంగి మాటలు ఎంత అర్థవంతంగా ఉన్నాయి:

> "దుర్దినములు రాకముందే- ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని చెప్పు సంవత్సరములు రాకముందే... నీ బాల్య దినములయందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" (ప్రసంగి 12:1).

రక్షణ విషయములోనే గాక, ఆయన కొరకై ప్రేమపూర్వకంగా సేవచేయడానికి కూడ యౌవన దశే మంచి సమయం. ఇప్పుడు చేయగల పనులను తరువాత చేయలేరని యౌవన క్రైస్తవులు గ్రహిస్తే ఎంత బాగుండును! యౌవనస్థులు తమ తోటి యౌవస్థులపై చూపే ప్రభావం ప్రత్యేకమైనది. యౌవనస్థుల ధైర్యసాహసాలను చూచి లోకము అబ్బురపడుతుంది. అవి వృద్ధులలో కనిపిస్తే ఇదో చాదస్తమని కొట్టిపారేస్తారు. యౌవనస్థులు వ్యయ ప్రయాసలకోర్చి ఆత్మీయ క్రైస్తవ పోరాటానికి ముందుకు రాగలరు, కాని వృద్ధాప్యంతో పాటు భయందోళనలు అధికమవుతాయి.

భవిష్యత్‌లో ముమ్ముందు క్రీస్తుకొరకై జీవించవచ్చునను ఊహతో క్రైస్తవ విశ్వాసులు చాలామంది వారి ఉద్యోగ జీవితాలను ప్రారంభిస్తారు, బాగా డబ్బు సంపాదించి, పదవీవిరమణ చేశాక దేవుని సేవ చేద్దామనుకుంటారు. ఈలోపు వృద్ధాప్యం ముంచుకొస్తుంది. దేవుడు మన శేష జీవితాన్ని కోరడు. శ్రేష్టమైనది, ఆయనకు పూర్తిగా అర్పితమైన దానినే కోరుకుంటాడు.

ఆయన పాత నిబంధనలో నిర్దోషమైన పరిపూర్ణ బలులను కోరాడు. ఆయన కోరికలో ఇప్పటికీ ఎలాంటి మార్పులేదు! మనము తెలిసి తెలిసి ఆయనకు ముడతలు పడినదానిని, కుంటి దానిని, పనికిరాని దానిని అర్పింపతగునా? తగదు. శ్రేష్టమైన దానిని ఇవ్వాలి, అదే మన యౌవనం!

> క్రీస్తునకు మేలైనది కావాలి. పూర్వం ఆయన మందలోని ప్రథమ ఫలములను కోరెను, శ్రేష్టమైన గోధుమలు కోరెను; నేటివరకును తన వారు తమ శ్రేష్టమైన అభిలాషలను, గొప్ప తలాంతులను ఆయన పాదముల చెంత సమర్పింపవలెనని మృదువుగా బ్రతిమాలుచున్నాడు. ఆయన మనము చేయు దీన సేవను, ఆ కాస్త ప్రేమను మరచువాడు కాడు, ఆయన మన యౌవత్తును కోరుచున్నాడు. క్రీస్తు శ్రేష్టమైన వాటిని ఇచ్చును. మనమర్పించు హృదయములను తీసికొని, తన మహిమాన్విత అందము, ఆనందము మరియు సమాధానముతో

నింపును; మనము ఆయన సేవలో నానాటికి బలపడుతుండగా, ఇంకా గొప్ప పనులు చేయాలి అను పిలుపు రెట్టింపగును. శ్రేష్ఠ ఈవులు ఇహపరమైనవైనా పరసంబంధమైనవైనా అవన్నియు క్రీస్తునందు దాగియున్నవి. మనకున్న మంచి ఈవులన్నియు యేసునందు పొందుకున్నవే. నీ శ్రేష్టమైనవన్నియు ఆయనవే అంటే నీకు అయ్యో అనిపిస్తుందా, అన్యాయముగా తోచుచున్నదా?

ఓ! నాస్నేహితులారా, మనకొరకై క్రీస్తు ఏవిధముగా తన ప్రాణమును ధారపోసెనో జ్ఞాపకము చేసికొందాం, తన శరీరమును సిలువపై ఎలా అర్పించెనో తలంచుకొందాం. ప్రభువులకు ప్రభువైనవాడు, లోకములను కలుగజేసినవవాడు కఠిన బాధ, కన్నీటి ద్వారా తన యావత్తును సమర్పించెను.

## ప్రభువా, నా పరిపూర్ణ బలమునందు

థామస్ హెచ్. గిల్

ప్రభువా, నా పరిపూర్ణ బలమునందు నేను నీ కొరకై నిబ్బరముగా నుందును;
నీ కొరకై ప్రతిదినం సంతోషంగా పరుగెత్తుతూ గాన ప్రతిగానములు చేసెదను.
నేను లోకమునకు నా హృదయమునిచ్చాక నీ ప్రేమను కోరను;
నా బలమంతా ఉడిగిపోయాక నీ సేవ చేయను;
లోకమూ దాని ఆశల నిమిత్తమై పరుగెత్తను;
అలసిన పాదములతో పరలోక శిఖరములను ఎక్కను;
నా బలహీన కోర్కెలు, హీన వాంఛలతో గాక, వయసు పైబడ్డాక,
నా శేష జీవితముతో గాక,
ఓ దేవా, నా మంచి బలమున్నపుడే, నా పూర్ణ హృదయముతో నిన్ను సేవించుటకై నన్ను నా సువర్ణ సమయమందే పట్టుకొనుము.

దారుణం జరిగాక ఎవరూ ఏమి చేయలేరు. అలాగే యౌవనం వ్యర్థపరచబడ్డాక ఏమీ చేయలేము. గనుక "నా యౌవన జీవిత చరిత్ర ఎలా ఉంటుంది? అని ప్రతి ఒక్కరు ప్రశ్నించుకోవాలి. ఏదో దేవునికొరకై అడపా దడపా చేసిన పనులతో నిండి ఉంటుందా? లేక ప్రభువైన యేసు క్రీస్తు నిమిత్తమై భారభరితముగా చేసిన చర్యలతో మిళితమై ఉంటుందా?"

*నీ జీవిత చరిత్ర నేడు వ్రాయబడుతోంది జ్ఞాపకముంచుకో!*

# నిత్యత్వంలోనూ ఎన్నదగిన విద్య

విద్యనే దైవంగా భావించే ఈ యుగంలో, చురుకైన యౌవన క్రైస్తవులు తమ జ్ఞాన సముపార్జన విషయంలో కొన్ని గొప్ప సత్యాల గురించి తెలుసుకొని వుండటం ముఖ్యం. తద్వారా, వారు వివిధ రకాల విద్యలకు తగిన విలువలను ఆపాదించగలుగుతారు.

ముందుగా మనం గ్రహించవలసిన విషయమేంటంటే, మనము పరలోకం చేరుకున్నప్పుడు సహా పరిపూర్ణ జ్ఞానము పొందము. దేవుడు మాత్రమే సర్వమును ఎరుగును; సర్వజ్ఞానము ఆయన స్వతసిద్ధ లక్షణము. మనమెన్నటికీ దేవుళ్లము కాము; నేర్చుకొనుట ఎన్నడూ ఆపివేయము. మనమా విషయాన్ని గ్రహించినట్లైతే అది మన నిత్యత్వపు సిద్ధపాటును ప్రభావితం చేయగలదు.

నేర్చుకునే ప్రక్రియ పరలోకంలోనూ కొనసాగుతుందని లేఖనాలు సూచిస్తున్నాయి. ఉదాహరణకు, పౌలు ఎఫెసీ 2:6లో ఇలా చెప్పాడు: "క్రీస్తుయేసునందు ఆయన మనకు చేసిన ఉపకారముద్వారా అత్యధికమైన తన కృపా మహదైశ్వర్యమును రాబోవు యుగములలో కనుపరచును." దేవుడు నిత్యత్వమునందును బయలుపరచబోతున్నట్లైతే, మనము నిరంతరము నేర్చుకుంటూనే ఉంటామన్నమాట. అది అలాగే ఉండాలి! దేవుడు నేర్పించే సందేశం ఎంత విస్తారమైనదంటే దాని మహిమలను వివరించడం దేవుడు ఎన్నటికీ పూర్తిచేయలేడు. సాతానుడైతే యేసు ప్రభువువారికి ఒక క్షణంలోనే ఈలోక వైభవమంతటిని చూపించగలిగాడు గాని, దేవుడు క్రీస్తుయొక్క శోధింపశక్యము గాని మహదైశ్వర్యమును వివరిస్తూ, తన విద్యార్థులను ఎప్పటికీ పట్టభద్రులను కానివ్వడు. ఆ సమయం అద్భుతమైన ప్రేమను

కనుపరచునదై యుండి ఎడతెగక ఉంటుంది. మంత్రముగ్ధులమైన విద్యార్థులవలె మనము ఆయన పాదాలచెంత కూర్చుని ఇంకా అధికంగా నేర్చుకుంటూనే వుంటాం.

మనము సమస్తమును పరలోకములోనే నేర్చుకుంటామను విషయంతో విభేదిస్తున్నట్లు కనిపించే ఒకటీ రెండు వాక్యభాలున్నాయి. ఉదాహరణకు, మనము క్రీస్తువలెనుందుమని యోహాను తన మొదటి పత్రికలో సెలవిచ్చాడు. ఏది ఏమైనా, ఇది మానసిక లేదా శారీరక పోలిక కాక నైతిక పోలికగా దీనిని మనము అర్థము చేసికోవాలి. మనము ఆయన పోలియుందుము అంటే మనం శాశ్వతంగా పాపపు ఉనికినుండి స్వతంత్రులమవుతామని అర్థం.

తర్వాత పౌలు "నేను ఎరుగబడిన ప్రకారము పూర్తిగా ఎరుగుదును" అని 1 కొరింథి13:12లో సూచించాడు. పరలోకంలో మన ప్రియులను మనము గుర్తించవచ్చునని ఇది తెలుపవచ్చు, కాని మనము మన సృష్టికర్తకు తక్కువ వారమై సృష్ట్యమువలె ఉండి పరిమిత జ్ఞానము కలిగియుందుమని మాత్రమే పైవచనానికి అర్థం. అంతేకాని మనము సమస్తమును ఎరుగుదుమని ఆ వచన భావము కాజాలదు.

మనము పరలోకంలో ఇంకను నేర్చుకుంటునే ఉంటామని ఒప్పుకున్నా, "నేను పరలోకము వెళ్ళిన వెంటనే ఎటువంటి జ్ఞానము కలిగియుందును"? అనే ప్రశ్నను మనము అడగవచ్చును. దానికి జవాబు ఏమిటంటే "నీవు ఈలోకం విడిచిన క్షణమందు ఏ జ్ఞానము కలిగియుంటివో అదే". రాబోవు తరములలో ఆ జ్ఞానము వృద్ధి అయ్యే అవకాశమున్నది వాస్తవమే. కాని మనము ఈలోకాన్ని విడిచి పరలోకం వెళ్ళినప్పుడు ఏ జ్ఞానం కలిగియున్నామో అక్కడనుండి తక్కినదంతా కొనసాగుతుంది. ఇదే వాస్తవమైతే, ఈ సంగతి చాలా ప్రాముఖ్యమైనది. మనము పరలోకము వెళ్ళినపుడు పనికిరాని జ్ఞానమును ఈ భూమిమీద ఉండగా సంపాదించుకున్నామని దాని నిమిత్తం జీవితమంతటిని ధారపోశామని గ్రహిస్తాం. ఏ ఇతర వ్యక్తికన్నా సాహిత్యంలో, రాజకీయశాస్త్రంలో, లేదా విజ్ఞానశాస్త్రంలో నీవు ఆసక్తి కలిగియుండవచ్చు. ఆ రంగంలో నీవు గొప్పగా సాధించవచ్చు. కానీ, దానివల్ల పరలోకంలో

నీకు ఏం మేలు జరుగుతుంది? అలాంటి ఆశలు, జీవిత పరమావధుల గురించి మనము నిత్యత్వపు వెలుగులో ఆలోచించినపుడు వ్యర్థమనిపిస్తాయి.

మరొక విధంగా చూచినట్లైతే, దేవుని వాక్యం నిత్యత్వంలోనూ ప్రాముఖ్యత మరియు విలువ కలిగియున్నది. మనము పరలోకంలోనూ పరిశుద్ధ లేఖనాలను కలిగియుంటాము గనుక భూమి మీద నేర్చుకొనే లేఖనాలు నిత్యత్వము కొరకైన పెట్టుబడి అవుతుంది. “భూమి ఆకాశము గతించిపోవును గాని నామాటలెన్నటికిని గతింపవు” అని యేసు చెప్పాడు. “ఓ దేవా, నీ వాక్యము ఆకాశమందు స్థిరపరచబడినది” అని కీర్తనాకారుడు అన్నాడు. మనము కంఠతపెట్టే ప్రతి వచనం, చదివే ప్రతి అధ్యాయం, బైబిల్‌లోనుండి నేర్చుకొనే ప్రతి సంగతి రాబోవు జీవితానికి లాభయుక్తంగా ఉంటుంది.

మనమందరము పరలోకంలో సమానముగా ఉంటామనే భావన లేఖనానుసారమైనది కాదు. నరకదండన విధించబడినవారికి శిక్షలో ఎలాగైతే వ్యత్యాసాలుంటాయో రక్షింపబడినవారికిని బహుమానాలలో వ్యత్యాసాలు ఉంటాయని దేవునివాక్యం తెలియజేస్తోంది.

పరలోకంలో అందరూ సంతోషముగానే ఉన్నా, కొందరు ఇతరులకంటె అధిక మహిమలను అనుభవిస్తారు. వాస్తవానికి మనము యేసు ప్రభువును ప్రశంసించుట అనునది ఇక్కడ ఉండగా వాక్యము ద్వారా ఆయనను ఎంతగా తెలుసుకున్నామనుదానిపై ఆధారపడి ఉంటుంది. ప్రతియొక్కరి పాత్ర నిండుగానే ఉంటుంది కాని కొందరి పాత్రలు ఇతరులకంటె పెద్దవిగా ఉంటాయి.

మనము భూమిమీద ఉండగా మన జీవనోపాధి నిమిత్తమై ఇహలోక జ్ఞానము లేదా లౌకిక జ్ఞానము కొంతమేరకు తప్పక సంపాదించుకోవాలి అనునది స్పష్టమే. ఈ కారణంచేత కొందరు కళాశాల చదువులు చదువుతారు, మరికొందరు ప్రత్యేక విషయాలపై ఉన్నత విద్యనభ్యసిస్తారు. కాని ఈ చదువులే జీవితంలో ముఖ్యమైనవి కావని గుర్తుంచుకోవాలి. క్రీస్తునెరుగుట– ఆయనను ఇతరులకు తెలియజేయుట అనునది ప్రధాన గురిగా నుంచుకొని మన విద్యాభ్యాసాలను జీవనోపాధి నిమిత్తమై వాడుకోవడం న్యాయమే. ఈ చదువులు ఉద్యోగ సంపాదనకు పదోన్నతికి వంతెన వంటివి. అవే సమస్తము

కాదు. శాశ్వతమైన దేవుని వాక్యమును నిర్లక్ష్యం చేసి విద్యా ఉపాధియందు మునిగి తేలటం క్షమార్హం కాదు. అలాంటి నిర్లక్ష్యం యొక్క పర్యవసానం నిత్యత్వంలోనే బయటపడుతుంది.

మనము పరిశీలిస్తున్న ఈ సంగతులు మన జీవిత గమ్యాన్నే మార్చివేయ గల గంభీరమైన ప్రభావం చూపుతాయి. మనకు పరలోకంలో సమస్తమును గూర్చిన పరిపూర్ణ జ్ఞానము ఉండబోనట్లైతే, మనమిక్కడ నేర్చుకొనే సంగతులనే మనతో పరలోకానికి తీసుకుపోతాం. గనుక మనము ఆ సన్నివేశం కొరకు సిద్ధపడేందుకు ప్రయత్నించాలి. పరలోకంలో ఎందుకూ పనికిరాని ప్రతి భూ సంబంధ విద్యావిజ్ఞాన ప్రయత్న విషయంలో మనము అప్రమత్తంగా ఉండాలి. మనకున్న కాలేజ్ డిగ్రీలు ఏవేవి ఉన్నా వాటి స్థానం వాటికిచ్చి వాటిని పనిముట్లుగా వాడి ఇక్కడ ప్రభువును ప్రభావవంతవంగా సేవించాలి. లేఖనముల కర్తతోను, అందులోని దివ్య సంగతులతోను సుపరిచితులమై మన జీవితంలో వాటికి సరైన స్థానమివ్వాలి.

పరలోకంలో పురోగతి ఉంటుంది, నిజమే! మనము పరలోకంలో నేర్చుకుంటూనే ఉంటాము! అక్కడ నేర్చుకొనుటలో ఉండే ఆనందం ఇక్కడ మనము బైబిల్‌ను ఏమిచేస్తున్నామనే దానితో ముడిపడివున్నది!

# నీ భవిష్యత్‌ను నీవే నిర్ణయించుకుంటావు

**చా**లావరకు, నీ భవిష్యత్‌ను నువ్వే నిర్ణయించుకుంటావు అన్న సత్యం తెలిస్తే, అది నిన్ను నిర్ఘాంతపరుస్తుందా? జీవితంలో నీవు నిజంగా ఏమి కావాలనుకుంటావో అదే అవుతావు. ఓ ఫలానా జీవిత శైలిని నీవు కోరుకుంటే, బహుశ నీవు అదే పొందుకుంటావు. ఇది విలువైన, మరింత విపులంగా తెలుసుకోవలసిన రహస్యం. నీ సొంత రేపటికి తాళపు చెవులు నీ చేతుల్లోనే ఉన్నాయి.

ఓ రాత్రి దేవుడు సొలొమోనుకు ప్రత్యక్ష్యమై నీకిష్టమైనది కోరుకొమ్మన్నాడు. బుద్ధి, వివేచనల నిమ్మని సొలొమోను కోరుకొనగా, వాటితో పాటు ఆయన ఐశ్వర్యము, ఘనత, విజయం, దీర్ఘాయువులనిచ్చాడు.

అదేవిధంగా, "నీకేమి కావాలో కోరుకో" అనే ప్రశ్న ప్రతి వ్యక్తియొద్దకు వస్తుంది. ప్రధానంగా మనము కోరుకొన్నదే మనకు ఇవ్వబడుతుంది.

లార్డ్ రోస్‌బెరి యౌవనస్థుడుగా ఉన్నపుడు మూడు ప్రగాఢ వాంఛలను కలిగియుండేవాడని చెప్తుంటారు:

1. డర్బీలో విజయం సాధించాలి
2. ఓ కోటీశ్వరుడి కుమార్తెను పెళ్లిచేసుకోవాలి
3. ప్రధాన మంత్రి కావాలి

పై మూడింటిని అతడు సాధించాడని చరిత్ర చెబుతున్నది.

కొన్నేళ్ల క్రితం, చికాగోలో ఓ యౌవనస్థుడు తన పడక ప్రక్కన మోకాళ్ళూని కీర్తన 145:19 ప్రకారం ఈ క్రింది సంగతుల కోసం ప్రార్థించాడు:

1. దేవుని వాక్యమును విస్తారముగా కంఠత చేయాలి.
2. కరపత్రికలు వ్రాసి వాటిని విస్తారముగా పంచాలి.
3. కరపత్రికలను సువార్తికులకు ఉచితముగా ఇవ్వాలి.
4. సువార్త ప్రకటించి దేవుని వాక్యమును బోధించాలి.
5. విశ్వాసుల ఎదుగుదల నిమిత్తమై వ్యాసాలు రాయాలి.

టామ్ ఓల్సన్ గురించి తెలిసినవాళ్లందరికీ తెలుసు- లేఖనాలను కంఠత చేయటంలో అతడు అసాధారణ ప్రతిభావంతుడని, తన సువార్త ప్రకటన, వాక్యపరిచర్యల ద్వారా అనేకులు ఆశీర్వదింపబడ్డారని, పత్రికలలో అతడు ప్రచురించిన శీర్షికలు, వ్యాసాలు విస్తారంగా వ్యాప్తినొంది చదువబడ్డాయని, అతని కరపత్రికలు బహుశా అందరికంటే విస్తారముగా పంపిణీ చెయ్యబడ్డాయని. ప్రతి యౌవనస్థుని విషయంలోను ఇలాగే ఉంటుంది. “వారి ఎదుట భవిష్యత్ ఓ ఖాళీ కాగితంలా ఉంటుంది, వారికిష్టం వచ్చినది ఎన్నుకొని దానిమీద వ్రాసుకోవచ్చు.”[1]

ఇక మన విషయానికొద్దాం! నీవు ఏమి కోరుకుంటావో జాగ్రత్త. నీ ఎంపికపై చాలా సంగతులు ఆధారపడివుంటాయి. దాని అంతము బహు భయంకరంగా ఉంటుంది.

> మండే కొలిమిలో బాగా మరిగిన ఇనుప ద్రవాన్ని ఏ మూసలోకైనా పోయవచ్చు; త్వరలోనే అది చల్లబడి గట్టిపడుతుంది, ఆ తరువాత సుత్తితో ఎంత గట్టిగా కొట్టినా దాని ప్రథమ ఆకారమును అంత సులువుగా కోల్పోదు.
>
> అదేవిధంగా యౌవనస్థులు వారి ముందున్న అవకాశాలను చూసి, ముందుగా తీసుకున్న నిర్ణయంపై ఆధారపడివుండే సంగతులను తరచిచూస్తే, త్వరగా మేల్కొని చక్కటి నిర్ణయాలు చేసి వాటికి కట్టుబడి ప్రయాసపడినట్లైతే వారి జీవిత ముగింపులో వ్యర్థపరచబడిన ఉషోదయాలు, విచారంతో కూడుకొన్న సంధ్యా సమయాలు తక్కువగానే ఉంటాయి.

ఉద్దేశపూర్వకంగా ఎన్నికచేసేవారు ఒక్కరుంటే, దారితొలగి పోయేవారు కనీసం ముగ్గురుంటారు. వారు కేవలం చదరంగంలో పావులుగా తమను తాము లెక్కించుకుంటారు. వారే కర్మవాదులు. అయినా, వారు నిర్ణయం

తీసుకున్నారు, దారితప్పి తిరిగేందుకు, మార్గంలో ఏది కనబడితే దానిని చేపట్టి ముందుకు సాగేందుకే వారు నిశ్చయించుకున్నారు.

ఆలోచనాపరులైన యౌవనస్థులు తమ శుభప్రదమైన స్థానము ప్రశస్తమైన వారి నిర్ణయాల విషయంలో మేల్కొనాలి. వారు అనుకోవాలేగాని దాదాపు ఏదైనా సాధించగలరని వారు గ్రహించాలి. అయితే, వారు ఎన్నుకొనేది యోగ్యమైనదో కాదో బహు జాగ్రత్తగా చూచుకోవాలి.

*“జీవితంలో నీకేం కావాలి”? అని*
*ఈరోజు దేవుడు నిన్నడిగితే, నువ్వేం కోరుకుంటావ్?*
*జాగ్రత్తగా విను!* ***ఆయన నిన్ను అడుగుతున్నాడు!***

# ఆశలు: వివేకవంతమైనవేనా?

**జీ**వితంలో గొప్ప అభిలాష ఏమిటి? మనం చనిపోయిన ఐదు నిమిషాల తరువాత ఎటువంటి విద్యా ఉద్యోగ జీవితమైతే ఉత్తమ సాఫల్యతనిచ్చినదిగా రుజువవుతుంది? మన సమయాన్ని, తలాంతులను, మనకు ప్రియమైన వాటిని ఓ చక్కని విధానంలో ఎలా వాడగలము?

"ధన సంపాదన" క్రైస్తవునికి సరియైన జీవిత పరమావధి కాదని మనము మొదట ఒప్పుకుందామా?

1. మొదట, దానిని ప్రభువే స్పష్టంగా నిషేధించాడు (మత్తయి 6:19), గనుక అది అనైతికత లేదా నరహత్యతో సమానము.
2. రెండవదిగా, ఆత్మీయ విషయాలకు వస్తుసంపద ఓ ఆటంకముగా ఉంటుంది (మార్కు 10:23,24).
3. ధనము మోసకరము (మార్కు 4:19): అది వాస్తవము వలె కనిపించును కాని త్వరగాను అనూహ్యముగాను గతించిపోతుంది.
4. మనకు మాదిరియైన యేసు ప్రభువు ఓ నిరుపేద (2 కొరింథి 8:9). దాసుడు యజమానికంటె గొప్పవాడు కాడని ఆయన పదేపదే చెప్పాడు (మత్తయి 10:24,25).
5. ఆస్తులను పరలోకమునకు తీసికొనిపోలేము (2 కొరింథి 4:18).
6. తన చుట్టూ ఉన్న ప్రపంచంలో పేదరికాన్ని, అవసరాలను చూస్తూ ఒక క్రైస్తవుడైన వ్యక్తి ధనికుడుగానుండుటలో నిజంగా ఓ నైతిక సమస్య ఉంది.

కొన్నేళ్ల క్రితం ఓంటారియో వార్తా పత్రికలో ఈ దిగువ కథనం కనబడింది:

> ఓంటారియోలోని పర్త్ అనే ఊళ్లో కీర్తిశేషులు జాన్ లివింగ్స్టన్ మరణించబోయే నాటికి అత్యంత ధనికుడిగా లెక్కించబడ్డాడు. అతని స్థిరాస్థి విలువ 500,000 డాలర్లు. అది మాత్రమే గాక అతనిపేరుమీద 500,000 డాలర్ల జీవిత భీమా కూడ ఉంది. ప్రముఖ స్కాట్లండ్ దేశపు మిషనరీయైన డేవిడ్ లివింగ్స్టన్ ఇతనికి స్వయాన సోదరుడు.

"స్కాట్లండులో ఉండగా బాల్యంలోనే ఈ ఇద్దరు కుర్రాళ్లు తమ జీవితాలకు సంబంధించిన గొప్ప నిర్ణయాలు తీసుకున్నారు. 'నేను కెనడా వెళ్ళి స్థిరపడతాను' అన్నాడు జాన్. అనుకున్నది సాధించాడు! డేవిడ్ తన జీవితాన్ని రక్షకుడైన యేసు క్రీస్తు ప్రభువుకు అర్పించాడు. ఆఫ్రికాలోని హింటర్ల్యాండ్ నందు నల్ల జాతీయులకు సువార్త నందించేందుకు తన ప్రాణాలకు సహా తెగించాడు. ఈ లోక ప్రమాణాలతో తీర్పు తీర్చినట్లైతే జాన్ తెలివైనవాడు, డేవిడ్ బుద్ధిలేనివాడు అవుతారు. కాని ఇహలోకదృష్టి చాలా హ్రస్వదృష్టి గలది. జాన్ తన వ్యాపారంలో అభివృద్ధిపొంది గొప్ప ఆస్తిపాస్తులు సంపాదించాడు, డేవిడ్ ఆఫ్రికాలోని ఓ పూరిగుడిసెలో ఒంటరిగా మోకాళ్ళపై ఉండి మరణించాడు. తదుపరి అక్కడే సమాధి చేయబడ్డాడు, కాని ఓ యాభై లేదా డెబ్భైఏళ్ల తరువాత జాన్ పేరు ఈ భూమిమీదనుండి తుడిచి వేయబడినట్లు మరువబడింది, అయితే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడెక్కడ సువార్త ప్రకటింపబడు తున్నదో అక్కడ డేవిడ్ లివింగ్స్టన్ పేరు మధుర సువాసనయై విలసిల్లు తున్నది".[1]

అయితే సిరిసంపదలకోసం పాటుపడటమే గొప్ప ఆకర్షణ కాదు! వ్యక్తిగతంగా పేరు ప్రఖ్యాతులు పొందాలి అనే మరొక వాంఛ మనుష్యులకు ఉంటుంది.

కొందరు తమ వృత్తి, వ్యాపారాల్లో అతిశయించాలనుకుంటారు. దాని నిమిత్తమై వారు తమ శక్తియుక్తులన్నీ ధారపోస్తారు. వారు వాణిజ్యశాస్త్రము లేదా విజ్ఞానశాస్త్రములను తమకొరకై ఓ గుడిగా కట్టుకొని వాటిని పూజిస్తారు. "నీవు నీ నిమిత్తము గొప్పవాటిని వెదకుచున్నావా? వెదకవద్దు" (యిర్మీయా 45:5) అని దేవుని స్వరము వారిని పిలుచుచుండగా, వారేమో తమతమ రంగాలలో విశేషంగా రాణించటానికి అహర్నిశలు కృషిచేస్తుంటారు.

కొందరు క్రీడా రంగంలో పేరుతెచ్చుకొనేందుకు పోరాడతారు. దాని నిమిత్తమై వారు ఎంతో కఠిన క్రమశిక్షణను పాటిస్తారు. అందులో మంచి సామర్థ్యం సంపాదించుటకై వారు సంతోషంతో త్యాగంచేయుటకై ఇష్టపడతారు. పోటీలో దిగి బహుమానము పొందుటకై ప్రతి కీలును కదిలించి పోరాడతారు. కాని "నరుల కాలిసత్తువయందు ఆయన సంతోషించడు" (కీర్తన 147:10) అని పరిశుద్ధ లేఖనాలు సెలవిస్తున్నాయి. ఆయన ఆటల అభిమాని కాదు. ఎందుకంటే "శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకర మవును..." (1 తిమోతి 4:8).

మరికొందరు తత్వశాస్త్రము, చరిత్ర లేదా సంగీతము మున్నగు వాటిలో ప్రతిభను కనబరచేందుకు ప్రయత్నిస్తారు. పరలోకంలో ఇసుమంతైనా పనికిరాని జ్ఞానం నిమిత్తమై ఆయా రంగాలలో క్రైస్తవులు వారి జీవితమంతటిని ధారపోయటం చాలా విచారకరం.

తోటివారికి సహాయపడాలన్న ఉన్నతాశయంతో ఇంకొందరు రాజకీయాలలో లేదా సమాజసేవలో మునిగితేలుతారు. ఇవన్నీ మెచ్చతగినవే అయినా వారి పరోపకార కార్యక్రమాల్లో ఒక లోపమున్నది. ఒక వ్యక్తికి సహాయం చేయాలన్నా, ఆ వ్యక్తి ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపించాలన్నా, నీవు విధిగా అతని స్వభావాన్ని మార్చాలి. ఆ పనిని నేటి ఆధునిక, దార్శనిక సంస్థలేవీ చేయలేవు. దానికి ఏకైక సమాధానం సువార్త. ఒక వ్యక్తిని యేసుక్రీస్తు ప్రభువునకు పరిచయం చేయటమే నిజమైన మానవ సేవ.

ఈ విధంగా మనుష్యులు జీవించగోరు సాధారణ సంగతులను ఎన్నిటినో మనము ఇలా పరిశీలిస్తూ పోతే, అవేవి కూడాను అంతటి పరిశ్రమకు అర్హమైనవి కావని తెలిసిపోతుంది. ఎందుకంటే అవి ప్రభావవంతమైనవి కావు, కాల పరీక్షలో నెగ్గలేవు. వాటి విలువ ఇహసంబంధ జీవితానికే పరిమితమైనది. రెండు లోకాలలోనూ అనగా ఇహ, పరములలోను జీవించు క్రైస్తవుని దర్శనాన్ని అవి నెరవేర్చలేవు.

ఇహ, పర లోకములను పరిగణలోనికి తీసుకొనని ఏజీవితమూ దాని నిజ

అర్థమును కనుగొనలేదు. ప్రస్తుత జీవితము మరియు రాబోవు జీవితము. తల నెరసిన వ్యక్తి భావి జీవితం గురించి ఆలోచిస్తే అది అతనికి మెప్పు కలుగజేస్తుందా?తల నెరవని వారియొద్దకు వెళ్ళి, ఇప్పుడే రెండు లోకాలకు చెందిన వ్యక్తివలె ఇహలోకంలోని అపనమ్మకము, స్వార్థము, హీనతనుండి విడిపింపబడి విశ్వాసము యొక్క సంకుచితత్వము మరియు దాని శ్రేష్టతలోనికి ప్రవేశింపుమని, ఇప్పుడే రెండులోకములకు చెందిన ఈ జీవితమును గూర్చి యోచించుమని వారిని బ్రతిమాలుకుంటాను. రెండు లోకములు, ఒకటి త్వరగా గతించునది మరొకటి అనంతమైనది! అద్దరిని మనకొరకై ఏమి దాచబడినది? అట్టి ప్రశ్న త్వరలోనే గతించు తాత్కాలిక జీవితమును నిత్యజీవితముగా మార్చును. నేడు నేను చేసినది నిత్యత్వమునందు నిలుచును. నేను దానిని చూడనంత వరకు జీవితపు సమస్యను ఎదుర్కొనుట ప్రారంభించలేదనే చెప్పాలి.

విలియమ్ కెల్లీ గొప్ప బైబిల్ విద్యార్థి. అతని పాండిత్యమూ ఆత్మీయత అతన్ని గ్రేట్ బ్రిటన్‌లో గత శతాబ్దపు ముగింపులో ఓ మహా శక్తిగా నిలబెట్టింది. మిస్టర్ కెల్లీకి యౌవనస్థుడైన ఒక బంధువున్నాడు. కెల్లీ అతన్ని డబ్లిన్‌లోని ట్రినిటీ కాలేజ్‌కి సిద్ధపరచాడు, ఈ విధంగా కెల్లీ అక్కడి అధ్యాపకుల కంటపడ్డాడు. కాలేజ్‌లో అధ్యాపకవృత్తి చేపట్టి పేరుప్రఖ్యాతులు సంపాదించుకొమ్మని అతన్ని బ్రతిమాలారు. కెల్లీ ఎటువంటి ఉత్సాహము చూపకపోవటంతో తక్కిన అధ్యాపకులు నిర్ఘాంతపోయారు. "మిస్టర్ కెల్లీ, లోకంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని లేదా మీకు?" అని ఓ అధ్యాపకుడు అడిగాడు. అందుకు కెల్లీ "ఏ లోకంలో నాయనా?" అని చమత్కారంగా జవాబిచ్చాడు.

అవును అంతే! మన జీవితాశయాలను పరిగణించుటలో, ఎదురయ్యే గొప్ప ప్రశ్న "ఏ లోకంలో నాయనా?" అన్నదే.

*ఈ ప్రశ్న వెలుగులో నీ ఆశ/ఆకాంక్ష పరీక్షకు నిలబడగలదా?*

# జీవితపు గొప్ప నిర్బంధాలు

ఒక వ్యక్తి తన భవిష్యత్ గురించి వివేకంతో ఆలోచించాలంటే మూడు గొప్ప మార్గదర్శక సూత్రాలను పరిగణలోనికి తీసుకోవాలి:

1. దేవునిపట్ల అతని విధి.
2. తన తోటివానికి తాను ఋణపడియున్న సంగతి.
3. అతని సొంత ఉత్తమ అభిరుచులు.

ఈ మూడు విధులను నిర్వర్తించలేని ఏ జీవితమూ నిజంగా విజయవంతమైందని చెప్పలేము.

## నీ దేవుడు

మొదట దేవుడు! ఆయన కేవలం మన సృష్టికర్తే అయినా, ప్రభువు మన అచంచల నమ్మకానికీ అనితర సేవకూ యోగ్యుడు. అట్టి గొప్ప సృష్టికర్త మన రక్షకుడయ్యాడన్న వాస్తవమున్నదే, అది మనం తప్పించుకునే వీలులేకుండ చేస్తోంది.

మనలో ప్రతిఒక్కరము ఈ నిత్య సత్యాలతో తలపడవలసియున్నది:

1. నా స్థానంలో మరణించడంకోసం దేవుడు తన దయనుబట్టి తన ఏకైక కుమారుని పంపెను.
2. ప్రభువైన యేసు తన పరలోక మహిమను వదలి నాకొరకై ఈ మలినమైన, అవమానముతో నిండిన లోకమునకు వచ్చెను.
3. నా ఆత్మను రక్షించుటకై ఆయన శ్రమపడి, రక్తముకార్చి మరణించెను.
4. మరణించినవాడు కేవలం మానవమాత్రుడు కాదు, సర్వ లోకములను కలుగజేసినవాడు.

5. నేను శత్రువునైయుండగా ఆయన నాకొరకై మరణించెను.
6. నా పాపముల వలననైన శిక్ష ఎంతో ఘోరమైనది. తత్ఫలితముగా ఆయన పొందిన శ్రమలు వర్ణనాతీతము. ఇట్టి సంగతిని మానవ బుద్ధి ఎన్నటెన్నటికిని గ్రహింపలేదు.
7. పాపపు సంతలోనున్న నన్ను విడిపించుటకై, నాకొరకై తన రక్తమును చిందించుటకై ఆయన నాకు చాలినంత విలువకట్టెను.
8. ఆయన నా రాజు, ప్రభువు మరియు యజమానునిగా నుండుటకు మరణించెను.

కాలక్రమంలో ఈ సత్యాలు క్రైస్తవునికి షరామామూలే అన్నట్టుగా తోచవచ్చు. కాని ఎప్పుడో ఒకసారి అకస్మాత్తుగా, వాటి మహిమా కిరణాలు మన హృదయాలలో ఉప్పెనలా ప్రకాశింపగా భయమునొంది ఈ క్రింది విధముగా మొరపెట్టవలసి వస్తుంది:

ఆయన నా నిమిత్తమై ఇంత చేశాక,
ఆయన నా నిమిత్తమై ఇంత చేశాక,
నేను నా సర్వమును అర్పించక ఆయన కొరకై
జీవించక ఎలా ఉంటాను?
ఆయన నా నిమిత్తమై ఇంత చేశాక. –బెట్టి డాస్వంద్

క్రీస్తు నన్ను తన రక్తముతో కొన్నాడన్న సంగతి వాస్తవమైతే, ఇకను నేను నావాడను కాను ఆయన వాడను మాత్రమే ననుట స్పష్టమే. పౌలు ఈ క్రింది విధంగా వ్రాస్తూ ఇలాగే తర్కించాడు:

> క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతము చేయుచున్నది; ఏలాగనగా అందరికొరకు ఒకడు మృతిపొందెను గనుక అందరును మృతిపొందిరనియు, జీవించువారిక మీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచిన వానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొను చున్నాము (2 కొరింథీ 5:14,15).

ఇకమీదట తమకొరకు కాక, ఆయన నిమిత్తమే! సి.టి.స్టడ్ కూడ మరొక విధంగా ఆలోచించలేకపోయాడు.

> యేసు నాకొరకై మరణించాడని తెలుసుకున్నాను, కాని ఆయన నాకొరకే మరణించినట్లయితే ఇక నేను నావాడను కానని మాత్రం గ్రహించలేదు. విమోచన అనగా అమ్ముడుపోయిన దానిని వెల చెల్లించి తిరిగి కొనుట, తద్వారా నేను ఆయనకే చెందుతాను, నాదికాని దానిని నాయొద్ద ఉంచుకుని నేను దొంగనైనా కావాలి లేదా సమస్తమును దేవుని కొరకై విడిచిపెట్టాలి. యేసు క్రీస్తు నా కోసం మరణించాడని నేను క్షుణ్ణంగా గ్రహించాక, సమస్తమును ఆయనకొరకై విడిచిపెట్టటం నాకు పెద్ద కష్టంగా తోచలేదు.

అందరికీ సుపరిచితమైనా, ఆచరణకు నోచుకోని గొప్ప పదాలలో ఐజక్ వాట్స్ పై భావాన్ని చక్కగా పొందుపరచాడు.

> లోకమంతా నాదే అయ్యుండి, ఆ సమస్తమునూ అర్పించినా అది ఓ చిరుకానుకే అవుతుంది; ఆశ్చర్యమైన ఆ దివ్య ప్రేమ నా ప్రాణమును, నా జీవితమును, నా సర్వమును కోరుతుంది.

కౌంట్ జింజెండార్ఫ్ ఇలా అన్నాడు. "నాకు అత్యంత ప్రియమైన వాటిని ఆయనకు అర్పించలేకపోతే నేను నా రక్షకునికి తగినవాడను కాకపోదునని భావించాను".

"ఆయన రాజే అయితే, అన్నిటిమీద ఆయనకు హక్కుంటుంది" అనే సత్యాన్ని ఉగాండలోని పిల్కింగ్టన్ బలవంతంగా ఒప్పుకోవలసి వచ్చింది.

మిస్టర్ టి. ఇ. విల్సన్ అను మిషనరి అంగోలాలోని స్థానికులతో మాట్లాడుతుండగా, ఆ గుంపులో లావుగా బలంగా ఉన్న ఒక వ్యక్తినీ, అతని ప్రక్కనే వణకుతూ భయపడుతున్న ఓ పిల్లవాడినీ గమనించాడు. ఆ బలమైన వ్యక్తి కదలినపుడెల్లా, పిల్లవాడు భయకంపితుడవుతున్నాడు. ఆ పిల్లవాడు బానిస అని ఆ బలమైన వ్యక్తి క్రూరమైన యజమానుడని ఆ కార్యక్రమము ముగింపులో మిషనరీ తెలుసుకున్నాడు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయక ఆ బానిస పిల్లవాడిని క్రూరుడైన యజమాని నుండి కొనాలని నిర్ణయించుకొని అతనితో బేరానికి దిగాడు మిషనరీ. యజమానుడు చాలా ఎక్కువ ధర చెప్పి, చివరకు ఆ పిల్లవాణ్ణి మిషనరికి అమ్మివేశాడు.

మిషనరీ ఆ బానిస పిల్లవాడిని తీసుకుని ఇంటికి బయలుదేరాడు. గత యజమానుడికి భయపడినట్లే అ అబ్బాయి తనకు కూడ భయపడుతున్నట్లు

మిషనరీ గ్రహించాడు. గనుక వారు ఇంటికి చేరాక, "బాబూ, ఇవాళ నేను నిన్ను కొన్నాను, ఇక నువ్వు నాకే చెందుతావు. అయితే ఇప్పుడు నువ్వు స్వతంత్రుడివి. నీకిష్టం వచ్చినట్లు చేయవచ్చు. అడవికి వెళ్ళి నీ సొంతవాళ్లతో జీవించవచ్చు, లేదా నా ఇంటిలోనే ఉండి నా కుటుంబంలో ఒక సభ్యునిగా మారవచ్చు" అని ఆ అబ్బాయికి చెప్పాడు మిషనరీ.

మిషనరీ మాటలలోని భావాన్ని గ్రహించిన వెంటనే ఆ అబ్బాయి కళ్ళల్లో కన్నీళ్ళు తిరుగుతుండగా, ఇలా అన్నాడు: "మిస్టర్ విల్సన్, నేను ఎప్పటికీ నీ బానిసగానే ఉండిపోతాను".

అంతకు మించి ఆ అబ్బాయి ఏం చెప్పగలడు? అదే ప్రకారం మనం కూడ ఇలా చెప్పాలి: "ప్రభువైన యేసూ నేను ఎప్పటికీ నీ బానిసగానే ఉండిపోతాను. నా చేతులు, కాళ్ళు, స్వరము, తెలివితేటలు– అన్నీ నీవే. నీవు నీ రక్తము చిందించి మరణించావు; అందుకే నేను నీకొరకే జీవిస్తాను."

దేవుని వాత్సల్యము మనలను ఆయనకు అర్పించుకొనేలా చేస్తుంది, మన జీవితాలను పరిపూర్ణంగా సమర్పించడమే ఆయనకు చేయు యుక్తమైన సేవ అవుతుంది (రోమా 12:1,2).

## నీ పొరుగువాడు

మనకు రెండవ బాధ్యత ఉన్నది, అదే మన తోటిమనిషి పట్ల ఉండే బాధ్యత. క్రైస్తవ్యమనేది ప్రధానంగా నిస్వార్థమైనది. "గ్రీసుదేశస్థులకును గ్రీసు దేశస్థులు కాని వారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను" అను లోతైన భావనను అది కలిగియుంటుంది (రోమా1:14). "నేను సువార్త ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ" (1 కొరింథీ 9:16) అను గురుతర బాధ్యతకలిగి ఆత్మలపట్ల భారము కలిగి ఆరాటపడుతుంది.

శ్రద్ధగల యౌవన క్రైస్తవులు ఈ క్రింది సంగతులను పరిగణించకుండ జీవితపు ప్రణాళికలను చేయకూడదు:

1. మన చుట్టూ ఉన్న ప్రపంచం నశించిపోతుంది.

    రోజుకు వందల వేలకొలది ఆత్మలు నశించిపోతున్నాయి.
    
    క్రీస్తులేని అపరాధంలో, నిత్య నాశనంలో కూరుకుపోతున్నాయి.

2. రక్షింపబడినవారికి అసమానమైన పరలోకపు ఆనందము వేచియున్నది, కాని క్రీస్తునెరుగక మరణించిన వారికి వర్ణనాతీతమైన నిత్య నరకపు వేదనలు సొంతమవుతాయి. ప్రతి క్రైస్తవుడు ఒక గంటపాటు మౌనంగా కూర్చొని నరకపు వేదనను, దానిలోని యాతనను, కఠిక చీకటిని గూర్చి ఆలోచించాలి. త్వరలోనే అక్కడ ఉండబోతున్న వారి బంధువులను గూర్చి, స్నేహితులను గూర్చి, ఇరుగు పొరుగువారిని గూర్చి, మనుష్యులందరిని గూర్చి యోచించాలి. మళ్ళీ సాధారణ, నిర్లక్ష్య, యధాతథ క్రైస్తవ జీవితం జీవించకుండ సుదీర్ఘంగా ఆలోచించాలి.
3. సువార్త వాస్తవము కానట్లైతే దానిని పూర్తిగా వదిలేయాలి, కాని అదే వాస్తవమైతే, దానిని భూదిగంతములవరకు చాటాలి. క్యాన్సర్ వ్యాధి నివారణ తెలిసినా అది నీ ఒక్కని ఉపయోగము నిమిత్తమై ఉంచుకోవడం నరహత్యతో సమానం. అలాగే ఆత్మల విషయమైన పాపపరిహార వాస్తవం తెలిసీ మౌనం వహించడం ఓ ఆత్మను హత్యచేయడమే అవుతుంది.

   పరలోకపు వివేకముతో మన ఆత్మలు వెలిగింపబడియుండగా, మనము మనుష్యులకు అజ్ఞానులవలె కనబడి, జీవపు వెలుగును త్రోసిపుచ్చుదామా?
4. ఈ తరం మనుష్యులకు ఈ తరంవారే సువార్తను అందించగలరు. గనుక మన బాధ్యత ఇతరులకు బదిలీ చేయబడకూడదు.
5. మహా ఆజ్ఞ విషయంలో మనమేం చేశామో లెక్క అప్పజెప్పవలసి యున్నది (మత్తయి 28:19,20). ఆత్మల విషయమైన రక్తపు మరకలు మన వస్త్రములపై కలిగియుండి మనము నిత్యత్వంలో ప్రవేశించుటకు సాహసిద్దామా?
6. మనము ఎదుర్కొను ప్రతి ఆత్మ రక్షకుని కిరీటంలో ఓ ఆభరణం కాగలదు. గనుక మనము ఆయన నిమిత్తమై వారిని ప్రేమించాలి. జీవితపు చుక్కానిని తప్పి పోకుండునట్లు మనము ఈ వాస్తవాలను ధైర్యంగా ఎదుర్కోవాలి.

## నీ విషయములో

తుదకు మన ఉత్తమ అభిరుచుల మేరకే మన జీవిత ప్రణాళికలు రూపొందించు కోవాలి. మొదట అది స్వార్థపూరితమైన ఆలోచనగా అనిపించవచ్చు. కాని

మనము శ్రేష్టమైన సంగతులను చేపట్టి సాధించాలని, మరి విశేషించి ఆయన ప్రేమతో మన విషయంలో సంకల్పించిన వాటిని చేయాలని దేవుడు కోరుతున్నాడు.

ఇహలోకంలోనూ రాబోవు జీవితంలోనూ పనికొచ్చే సంగతులనే నేను ఎలా చేపట్టగలను? ఈ క్రిందివాటిని యౌవన క్రైస్తవులు లోతుగా ధ్యానించాలి:

1. నీ ఆత్మ రక్షింపబడికూడ నీ వాస్తవ జీవితం పాడైపోవటం సాధ్యమే.
2. ఈ జీవితం ఇంతటితోనే అంతంకాదు, ఇది కేవలం రాబోవు జీవిత విషయంలో ఓ పెట్టుబడి. "ఈ జీవిత కాలము రాబోవు పరిపాలనా జీవితానికి ఓ శిక్షణా కాలం."
3. నీవు చనిపోయాక కూడ పని చేయులాగున ఇప్పటి జీవితాన్ని నీవు క్రమపెట్టుకోవచ్చు. "ఒకడు సమాధిలో పరుండినను పనిచేయులాగున యధార్థముగా తనకు తాను ఓ వ్యాపకాన్ని కలిగించుకోవాలి" అని ఎఫ్.డబ్ల్యు.బోర్హ్యామ్ చెప్పాడు.
4. ఒక దినాన మనము క్రీస్తున్యాయపీఠము ఎదుట నుంచోవాలి! లెక్కకు వచ్చునదేది? దేవుని కొరకై జీవించిన జీవితమే.
5. ఆ దినాన రిక్తహస్తాలతో వెళ్లే భయానక అవకాశం ఉంది.

   రిక్తహస్తములతోనే నా విమోచకుని కలువవలెనా,
   నా రక్షకునికి ఒక దినమైనా సేవ చేయక,
   ఎట్టి జ్ఞాపికను ఆయన పాదముల చెంత సమర్పించక,
   రిక్తహస్తములతోనే నా రక్షకుని నేను దర్శించవలెనా?
   ఒక్క ఆత్మతోనైనా వెళ్ళి నేనాయనను పలకరించలేనా,
   రిక్తహస్తములతోనే నేను వెళ్ళవలెనా? –సి.సి. లూథర్

6. ఆయన చేత "భళా" అనిపించుకునే అవకాశం చేయిజారిపోతే, ఆ నష్టాన్ని పూడ్చడం దేనితరమూ కాదు.

   దారినపోతున్న ఓ సత్యాన్వేషి, నిన్ను దాటిపోవడం వల్ల కలిగే అపారమైన నష్టంతో పోలిస్తే, త్రాసుమీద ఉండే దుమ్మువల్ల నీ వ్యాపారంలో కలిగే నష్టం ఏపాటిది? అదేరోజు సాయంత్రం వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ సంధ్యావెలుగులో మనలను విమోచించిన ప్రభువు ఆ దారివెంట నిలబడి,

"ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని అటుగా పోతున్న ఓ ఆత్మకు ఆయన్ని పరిచయం చేసేవారికోసం వెతుకుతున్నాడు- కానీ అక్కడ మనం లేము. ఆ దృశ్యం ఎలావుంటుందో ఊహించారా?[1]

మనము దేవుని చిత్తంలో ఉన్నప్పుడు మాత్రమే, ఇహము పరము విషయంలో మన ఆపేక్షలకు అర్థం ఉంటుందని తెలుసుకోవడానికి ఓ క్షణకాలపు ఆత్మ పరిశోధన చాలు.

అలాగైతే, మనము ఆగి మన ఆశలు అభిలాషలు ఎలావున్నాయో పరీక్షించుకొని, మనకు మనం ఈ ప్రశ్నలు వేసుకుందాం:

1. దేవుని పట్ల నేను నిర్వర్తించవలసిన విధిని అవి గుర్తిస్తున్నాయా?
2. మనుష్యుల ఋణం తీర్చుకునేలా అవి నాకు దోహదపడతాయా?
3. ఈ జీవితంలోనూ పరలోకంలోనూ అవి అధిక రాబడులనిస్తాయా?

నీ ఆశలు/అభిలాషలు పై మూడు ప్రశ్నలకు జవాబివ్వలేని స్థితిలో ఉంటే, అవి ఎన్నతగినవి కావు గనుక వాటిని ప్రక్కన పడెయ్యడం మంచిది.

# జీవితపు గొప్ప సమర్పణ

ప్రతి విశ్వాసీ తన దేవుని పట్ల, తన పొరుగువాని పట్ల మరియు తన పట్ల తాను నిర్వర్తించవలసిన గంభీరమైన కర్తవ్యం కలిగియున్నాడని గత అధ్యాయంలో మనం చూశాం. సృష్టి, విమోచన విషయంలో ఆయన చేసిన కార్యాన్ని బట్టి దేవునికి; క్రీస్తులేని తన పొరుగువాడు శాశ్వతంగా నశించిపోతాడు గనుక తన పొరుగువానికి; వ్యక్తిగతంగా ఒకరోజున అతడు క్రీస్తు న్యాయపీఠం ఎదుట నిలువబడాలి, ఆరోజున అతని యావత్ జీవితమూ పునర్విమర్శ చేయబడుతుంది గనుక వ్యక్తిగతంగా విశ్వాసి తనకు తాను బాధ్యుడైయుండాలి.

క్రైస్తవుడు ఏ విధంగా ఈ మూడంచెల విధిని చక్కగా నిర్వర్తించగలడు? అతడు తనకొరకే జీవిస్తే ఈ జీవితమందును రాబోవు జీవితమందును మిక్కిలి దౌర్భాగ్యుడైయుంటాడు. ఇది తన ఆశలకు అనుగుణంగా జీవించినట్లు అవుతుందా?

సువార్తతో సంబంధం లేకుండ తన పొరుగువాని క్షేమం కొరకు ప్రయాసపడితే అతనికి నిజంగా ఏ మేలూ చేయనట్లే. ఎందుకంటే, మనుష్యులకు కావలసింది క్రీస్తు. గనుక ఆయన లేకపోతే మనిషి శాశ్వతంగా నశిస్తాడు.

కానీ, మరోవైపు అతడు తన జీవితాన్ని ప్రభువువైపు మరల్చినట్టైతే ఏ పొరపాటూ చేయలేడు. ఎందుకంటే, అతడు దేవుని ఉన్నతంగా ప్రేమించిన వాడై, సువార్త వలననైన సహాయమును తన తోటి మానవులకు చేస్తాడు. గనుక తన అభివృద్ధి నిమిత్తమై పాటుపడి ఇప్పుడు సంతోషమును, ముస్ముందు బహుమానములను సంపాదించుకుంటాడు. క్రైస్తవజీవితంలో అతిగొప్ప రహస్యము ఒకడు తన సమస్తమును దేవునికి సమర్పించుటలోనే దాగివుంది.

మన జీవితాలకు ఏది శ్రేష్టమైనదో మనకు తెలియదు అనే యదార్థ ఒప్పుకోలు తోనే ఆ సమర్పణ ప్రారంభమవుతుంది. “యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరులవశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును” అని యిర్మీయా10:23లో తన భావాన్ని చక్కగా వ్యక్తపరచాడు.

దేవుడు నా నిమిత్తమై “శ్రేష్టమైన ప్రణాళికను” కలిగియున్నాడు అను ప్రగాఢమైన ఒప్పింపును కూడ అది కలిగివుంటుంది. మనము దానిని యదార్థముగా ఆశించినట్లైతే దానిని పొందవచ్చు. కనీసం “రెండవ” లేక మూడవ లేదా ఏదో ఒక ఉత్తమ ప్రణాళికను కలిగియుంటాం.

దీనిని నిజంగా విశ్వసించి, మన జీవితాలను ఆయనకు లోబరచుట ద్వారా మనము ఓ గొప్ప సమర్పణ చేస్తున్నాము. మన ప్రాణాత్మ దేహములను అనగా సర్వమును ఆయనకే అంకితము చేయుటయే సమర్పణ. మన శరీర అవయవములన్నిటిని, మనకున్న యావత్తును ప్రతిష్టించుట. బేషరతుగా మనము ఆయనకు అప్పగించుకొనుట అని దాని భావము. కచ్చితముగా లొంగిపోవుటయని దాని అర్థము.

బెట్టి స్టామ్ హతసాక్షి కాక మునుపు తొమ్మిది సంవత్సరాల క్రితమే తన బైబిల్‌లో ఈవిధంగా వ్రాసుకుంది:

> “ప్రభువా నా సంకల్పములు అభిలాషలు కోరికలు నిరీక్షణలు అవి శరీర సంబంధమైనవైనా లేదా ఆత్మీయమైనవైనా వాటిని విడనాడి నేను నా జీవితము కొరకైన నీ చిత్తమునే స్వీకరిస్తున్నాను. ఎప్పటికీ అవి నీవైయుండు లాగున నన్ను, నా జీవిత సర్వస్వమును నీకు అర్పించుకొంటున్నాను. నా స్నేహాలన్నిటినీ నీ సంరక్షణకే అప్పగించుకొంటున్నాను. నేను ప్రేమించువారందరూ నా హృదయంలో రెండవ స్థానమునే తీసుకోవాలి. నన్ను నీ ఆత్మతో నింపుము. ఏది ఏమైనా ఇప్పుడును ఎల్లప్పుడును నీ పరిపూర్ణ చిత్తమును కార్యసాధకము చేయుము. నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే.[1]

యేల్ నివాసియైన బోర్డెన్ చైనాకు సువార్తపని నిమిత్తమై వెళ్తూండగా ఈజిప్టులో మెదడు సంబంధమైన వ్యాధితో మరణించకమునుపు కొన్నేళ్ల క్రితమే ఈ విధంగా తన జీవితంలో అతిశ్రేష్టమైన సమర్పణ చేశాడు:

ప్రభువైన యేసూ, నా జీవితానికి సంబంధించినంతవరకు సమస్తమును నీకే అర్పిస్తున్నాను. నేను నిన్ను నా హృదయ సింహాసనముపై నిలుపుతున్నాను. నీకిష్టము వచ్చినట్లుగా నన్ను మార్చి, శుద్ధిచేసి నన్ను వాడుకొనుము. నీ పరిశుద్ధాత్మ శక్తిని నేను సంపూర్ణముగా తీసికొనుచున్నాను. నేను నీకు కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

"నా చిత్తము కాదు నీ చిత్తమే కానిమ్ము" అని తూర్పున ఉన్న తోటలో ప్రభువు పలికిన మాటల ప్రతిధ్వనులే పైవిధమైన ప్రార్థనలు.

దేవుని సంగతులలో ఎదుగుతున్న ప్రతి ఆత్మ విషయంలో ఇది వాస్తవమై ఉండాలి. తన స్వచిత్తాన్ని ప్రక్కనబెట్టి తనను తాను సజీవ యాగముగా దేవునికి సమర్పించుకొని ఈ క్రింది విధంగా చెప్పగలగాలి:

నీవు నన్ను ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళ్తాను;
నీవు నన్ను ఏదైతే చేయగోరుతున్నావో అది చేస్తాను;
నీవు నన్ను ఏదైతే చెప్పమంటావో అది చెబుతాను;
నీవు ఎలా ఉండమంటే నేను అలా ఉంటాను.

ఒకసారి ఇటువంటి బేషరతు సమర్పణ చేశాక, అది అనుదినము అభ్యాసము చేయబడాలి. విశ్వాసి లోబడు స్థితిలో ఉండాలి. అతడు తన యజమాని ఆజ్ఞ కొరకు కనిపెట్టుకొనియున్న బానిసనని జ్ఞాపకముంచుకోవాలి. ప్రతి విషయంలోను క్రీస్తుయొక్క ప్రభుత్వమును ఒప్పుకోవాలి.

అప్పుడేమౌతుంది? ఆ వ్యక్తి గొప్ప భౌతిక పరిమార్పును అనుభవిస్తాడా? బావోద్రేక మాంద్యము ఏదైన ఉంటుందా? పరలోకము నుండి అగ్నితో కూడిన జవాబు వస్తుందా?

చాలా సందర్భాలలో అట్టి బాహ్య లేదా సంచలనాత్మక సూచన లేవీ ఉండవు. దానికి బదులుగా పరలోకమందు దేవుడు విన్నాడని, అర్పణను స్వీకరించాడని ఒక విశ్వాసయుక్తమైన నిశ్చయత కలుగుతుంది. ప్రాధేయపడుతూ పాపులముగా వచ్చినపుడు ఆయన మనలను రక్షిస్తాడని ఎలాగైతే నమ్ముతామో అలాగే మనము ఆయనయొద్దకు సజీవయాగముగా వచ్చినప్పుడు కూడ మనల్ని స్వీకరిస్తాడని నమ్మాలి.

అటుపిమ్మట క్రైస్తవ జీవితం సర్వసాధారణమనిపించి నిరుత్సాహం ఎదురయ్యే ప్రమాదముంది. కొన్ని విధాలుగా చూస్తే జీవితమంతా యథావిధిగా ఉన్నట్లు అనిపిస్తుంది. బహుశ మనము రోజువారీ చేసే పనులు లెక్కలేనివిగా అనిపిస్తాయేమో. కాని, సమర్పణతో జీవించటం, నీవు నడిచే దారి నీకొరకై ఏర్పరచబడిందని గ్రహించటమే ఇక్కడ గొప్ప సంగతి. నీవు చిన్న చిన్న విషయాలలో నమ్మకంగా ఉంటుండగా, దేవుడు నిన్ను నీ కష్టాలగుండా నమ్మకంగా నడిపిస్తాడు. ఆ విధంగా దేవుడు నీ జీవితంలో అన్నింటిని సమకూర్చి జరిగించటం గమనిస్తావు. పరిస్థితులు "చక్కబడుట" గమనిస్తావు. అనుకొనని ద్వారాలు తెరువబడుట నీవు గమనిస్తావు. అంతవరకు నీవు నీ స్వశక్తితో ఆయా తరుణాలను తెరువ ప్రయత్నిస్తే అవి తెరుచుకోలేదు. కొన్ని సందర్భాలలో దేవుని నడిపింపు అస్పష్టంగా ఉన్నా, నీ సమర్పణ జీవితంలో నీవు వెనక్కి వెళ్ళి చూసినట్లయితే, ప్రభువు నిన్ను నడిపిస్తూ వచ్చాడని, నీ కెరీర్ "హాయిగా" సాగిందని గ్రహిస్తావు.

అందులో చాలా వేచియుండుట, వేదనకరమైన ఎదురు చూపులు ఇమిడివుంటాయి. ఇలా వేచివుండటమనేది మనవల్ల కానిపని. అయినా అది మనకెంతో ఆవశ్యకమైన తర్ఫీదులో ఒకభాగం.

వెన్నుచూపి పారిపోవడం, పునరాలోచించుకోవడం, బలిపీఠం మీదనుంచి అత్యంత హేయమైన రీతిలో జారిపోవడం వంటి ప్రమాదం ఎల్లప్పుడు పొంచివుంటుంది. ఓ క్రైస్తవుడు తన గదిలో గోడమీద ఈ మాటలు వ్రాసుకున్నాడు: "ప్రభువా, ఏది ఏమైనా నన్ను నీ నిమిత్తమే ఉపయోగించుకో". అయితే ఒకరోజు అతడు నెమ్మదిగా వెళ్లి ఆ నినాదాన్ని తొలగించాడు- ఎందుకంటే దాని మూల్యం చాల ఎక్కువ అనిపించింది. నాగటి మీద చెయ్యిపెట్టి వెనుకతట్టు చూచు వాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడు (లూకా 9:62) గనుక మన అర్పణలు తిరుగులేనివిగా ఉండాలి.

సమర్పణాయుత జీవితంలో ఇతరత్రా ఏమైనా ఉండనీ, కానీ సమర్పించు కున్నందుకు బాధపడటమనేది మాత్రం ఉండదు. "వెనుదిరుగను, వెనుకంజ వేయను, విచారించను" అని ఆ జీవితం గురించి బోర్డెన్ చక్కగా చెప్పాడు. అలాంటి జీవితమే నిజంగా ప్రయోజనకరమైన జీవితం.

ఇప్పుడు మనము దీనినంతటిని ప్రయోగాత్మకంగా వ్యక్తిగతంగా అన్వయించుకోవాలి. మనలో ప్రతి ఒక్కరము దేవుని సన్నిధిలో ఈ దిగువ ప్రశ్నలను ఎదుర్కోవాలి!

1. *నీవెప్పుడైనా జీవితపు గొప్ప సమర్పణ చేశావా?*
2. *వాస్తవానికి ఆయనకే చెందిన ఈ జీవితాన్ని పట్టుకొని వ్రేలాడుతూ, ఇది నా జీవితమంటూ దేవునికి వ్యతిరేకంగా పోరాడుతున్నావా?*
3. *నీకొరకై మరణించిన రక్షకుని నిమిత్తం నీవు చేసే త్యాగాలలో ఇది చాలా గొప్పది అని దేనిగురించయినా భావిస్తున్నావా?*
4. *ఇంకను నీవు వెళ్ళుటకు ఇష్టపడని స్థలమేదైనా ఉన్నదా?*
5. *నీ హోదాకు తగని పని చేయమని దేవుడు నిన్ను పిలుస్తాడేమోనని భయంగా ఉందా?*
6. *ఎటువంటి అరమరికలు లేకుండ - ఇప్పుడే -ఉన్నపాటున నీ జీవితాన్ని యేసు క్రీస్తునకు సమర్పించేందుకు నీవు ధైర్యం చెయ్యగలవా?*

***అలా చేయకుండుటకు నీవు సాహసించగలవా?***

# వృత్తి – దాని పాత్ర

క్రీస్తుకు లోబడుట అనే అంశం గురించి చర్చించిన వెంటనే, ఎవరో ఒకరు ఇలా అడగవచ్చు: "అదిసరే, నేను బ్రతకాలి కదా, నా బ్రతుకుదెరువు సంగతేంటి?" అంటూ తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయొచ్చు. ఆలోచన ఇంత దయనీయంగా ఎలా గలిబిలి అవుతుంది? అందులోని భావన ఇలా ఇమిడి ఉంటుంది:

1. ఏది ఏమైనా కాని, మనము జీవించాలి;
2. క్రీస్తుకు తమ జీవితాలను అర్పించుకున్నారంటే వారు ఆటోమేటిక్‌గా సంపూర్ణ సేవలో ప్రవేశించినట్టే గనుక బ్రతుకుతెరువుకోసం వారు ఏపనీ చెయ్యరు;
3. దేవునికి విధేయుడైనట్లైతే అతడు ఆకలితో అలమటించే అవకాశం చాలా ఉంది. అంతకు పూర్వం "చక్కటి ఉద్యోగము" కలిగియుండేవాడు గనుక ఎలాంటి బాధ ఉండేది కాదు.

ఇది లోపభూయిష్టమైన వాదన. మొదటిగా, మనము బ్రతకవలసిన అవసరం లేదు. యేసు ప్రభువు దాసులు ఇహలోకం నుంచి ఎప్పుడు ఎలా వెళ్లిపోవాలో నిర్ణయించుకోరు. ఆయన అనుమతించినంత కాలం బ్రతకటమే ప్రాముఖ్యం. అంతవరకు మనకు చావే వుండదు.

అది తప్పుడు వాదన అనడానికి రెండో కారణం ఏమిటంటే ప్రతి విశ్వాసి సంపూర్ణ సేవలో ఉండాలి. కొందరికి వారి ఉద్యోగమే ఓ మిషన్ ఫీల్డ్, ఇంకొందరికి వంటగదే ఓ మిషన్ ఫీల్డ్. కొందరు ఆఫ్రికాలో నశిస్తున్న వారికి మరికొందరు అమెరికాలో నివసిస్తున్న వారికి సువార్తను ప్రకటిస్తారు.

పై వాదన తప్పు అనడానికి చివరి కారణం ఏమిటంటే, ఎవరైతే క్రీస్తు సేవను ప్రధానంగా ఎంచుకొని పనిచేస్తారో అట్టివారి కనీస అక్కరలు తీర్చబడతాయన్న హామీని అది మరచిపోతోంది.

> కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును (మత్తయి 6:33).

కాని ఈ విషయమంతటిలో మన ఆలోచనకు స్పష్టత వచ్చేలా, ఒక క్రైస్తవుని జీవితంలో వృత్తి యొక్క పాత్ర ఏమిటో క్లుప్తంగా పరిగణించాలి.

1. మానవుడు పనిచేయుట ద్వారానే తన జీవనోపాధిని సంపాదించుకొనుట అనేది దేవుని సాధారణ సంకల్పం.

   నీవు చెమట కార్చి ఆహారము తిందువు; (ఆదికా 3:19). ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను (నిర్గమ 20:9). ఎవడైనను పనిచేయ నొల్లనియెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా (2 థెస్స 3:10).

2. క్రైస్తవుడు తాను చేపట్టవలసిన కెరీర్ విషయంలో ప్రభువు నడిపింపును కోరాలి. తాను మిషన్ ఫీల్డ్‌లోనికి వెళ్ళడానికి ఎలాగైతే స్పష్టమైన ప్రభువు నడిపింపును కోరుతాడో అలాగే తన ఉద్యోగ విషయంలోను కోరాలి.
3. ఈ విధంగా, ఉద్యోగం చేయుట అనేది దూర ప్రాంతంలో సువార్త పనిచేయటంకంటే తక్కువేమీ కాదు. ఉద్యోగ ఎంపికలో ప్రభువుచే నడిపింపబడ్డానని తెలుసుకోవడమే గొప్ప సంగతి. అయితే, అతడు నిజంగా ప్రభువు చిత్తానికి లోబడి, ఎక్కడికైనా వెళ్ళటానికి ఇష్టపడితేనే తప్ప ఈ విషయంలో పూర్తి నిశ్చయతను కలిగియుండలేడు.
4. "దేవుని సేవ", "లోకసంబంధమైన ఉద్యోగం" అంటూ ఈనాడు సాధారణంగా కనిపించే వ్యత్యాసం లేఖనానుసారమైనది కాదు. పని ఏదైనా అది దేవుని మహిమకొరకై చేయబడితే ఆపని దివ్యమైనదే. ఈ విషయంలో జి. క్యాంప్‌బెల్ మోర్గన్ క్రింది విధంగా వ్రాశాడు:

   "రోజువారి సాధారణ పనులు" అనే మాటను ప్రతిఒక్కరి జీవితంలోనుంచి కొట్టివేయాలి. పనిచేసేవాడు పరిశుద్ధుడైతే, ప్రయాస అంతా పవిత్రమైనదేనని

యేసు బోధించాడు. వాదించాలని కాదు గాని మానవ జీవితంలోని అపోహనుబట్టి ఒక మాట చెప్తున్నాను: ఒక వ్యక్తి వాక్యం బోధించి కొన్ని కార్య క్రమాలు నిర్వహిస్తున్నాను గనుక నేను "పవిత్రమైన సేవ" చేస్తున్నానని భావించడానికి వీల్లేదు. ఒకడు తన ప్రవర్తనయందు పరిశుద్ధుడైయుండి, రేపు ప్రొద్దుటే తన సంచిలో పనిముట్లు వేసికొని పనికి వెళ్ళినట్లైతే అతని పనికూడ పవిత్రకార్యమే అనిచెప్పుకోవచ్చు, అతడు ఓ వడ్రంగిపనికి వెళ్లి, ఒక మొద్దును రంపంతో కోస్తే, ఆ రంపాన్ని ఉపయోగించినవాడు ఓ యాజకుడైతే, ఆ రంపం దేవుని మందిరంలో ఉన్న పాత్రలతో సమానం అవుతుంది. ప్రతివిధమైన పని పవిత్రమైనదే. వచ్చేవారమంతా మీరు కౌంటర్‌లో ఉండి పని చేసినా, కార్యాలయంలో పని చేసినా, నా ప్రియ సహోదరీలారా, మీరు ఇంటిలో వంటపని చేసినా, మీ మనస్సులో 'పనివాడైన క్రీస్తు'ను గుర్తుంచుకుంటే చాలు, మీరు చేసేదంతా దైవసేవే అవుతుంది.

5. ఉద్యోగ ప్రయత్నంలో ఉండి దేవుని నడిపింపుకై ప్రయత్నించే విశ్వాసి ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రభువు ఒకని సహజ తలాంతులను బట్టే అతన్ని సంబంధిత రంగంలో వాడుకొంటాడు. ఇదేమీ మినహాయింపులు లేని ఖచ్చితమైన నియమమేమి కాదు కాని, సాధారణ నడవడికి ఒక నమూనాగా చెప్పుకోవచ్చు.

6. అనుమానాస్పద రంగంలోనికి కాని ఉద్యోగంలోనికి గాని ప్రభువు నిన్ను నడిపించడనేది విస్పష్టం. సాక్ష్యజీవితంలో రాజీపడవలసి వచ్చి, లోక విధానంలో తలమునకలయ్యేట్లు చేసే ఉద్యోగమైతే విశ్వాసి అందులో చేరకూడదు.

7. జీవితంలో ఉద్యోగమే సమస్తం కాదు అనేది అతి ప్రాముఖ్యమైన సంగతిగా గుర్తుంచుకోవాలి. అది కేవలం ఓ మార్గం/విధానం. కేరీ చేసిన వ్యాఖ్యలు అంత ప్రసిద్ధి పొందనర్హమైనవే. 'కేరీ, నీ అసలు పని ఏమిటి?' అని అడిగినపుడు "సువార్త ప్రకటించడమే నా పని; ఖర్చుల కోసం చెప్పులు బాగుచేస్తుంటాను" అని జవాబిచ్చాడు.

డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వ్యవస్థాపకుడైన జాన్ వనమేకర్ గురించికూడ ఇలాంటి కథే చెప్పబడింది. అంత బిజీగా ఉండే మీరు సండే స్కూల్

కొరకు సమయం ఎలా కేటాయించగలుగుతున్నారు అని ఆయన్ని ప్రశ్నించినపుడు "ఎందుకుండదు, సండే స్కూలే నా ప్రధానమైన పని కదా. తక్కినవన్నీ తరువాతే. "మొదట దేవుని రాజ్యమును ఆయన నీతిని వెదకుడి అప్పుడవన్నియు అనుగ్రహింపబడును" అన్న ప్రభువు వాగ్దానం వాస్తవమని నేను యాభైఐదేళ్ల క్రితమే నిశ్చయించుకొన్నాను.

ఈ గొప్ప సంగతిని మనసులో పెట్టుకోవాలి! ప్రభువు పని ప్రధానం, మన వ్యాపారాలు తరువాత. ఉద్యోగానికి ప్రాధాన్యత ఇచ్చినపుడు ప్రమాదం ఏర్పడుతుంది. డేరాలోనికి ఒంటె ప్రవేశించినట్లు, ఉద్యోగం అనవసరంగా స్థలం ఆక్రమించి అసలు హక్కుదారుని బయటికి నెట్టివేస్తుంది. స్థానిక సంఘ కూడికలకు రాకుండా ఉద్యోగం అడ్డుపడుతుంది. కాలక్రమంలో ఉద్యోగమే అధిక సమయాన్ని ఆక్రమిస్తుంది. తుదకు క్రైస్తవ సేవను ఆటంకపరచి నిరర్థకంగా చేస్తుంది.

సాధారణంగా దాని ఫలితమేమిటంటే, విశ్వాసి తన జ్యేష్ఠత్వపు హక్కు విషయంలో మోసగింపబడతాడు. జోవెట్ చెప్పినట్లు ఆవ్యక్తి "త్వరలోనే బోర్డు తిప్పేసే కంపెనీలో ఓ మోస్తరు అధికారిగా మిగిలిపోతాడు". "ద్వితీయస్థాయి ఉద్యోగాన్ని హత్తుకోవడం" ద్వారా జీవితంలోని ముఖ్యసంగతిని కోల్పోతాడు.

8. ఉద్యోగానికి రెండవ స్థానమివ్వాలి అంటే, ఆ ఉద్యోగాన్ని నిర్లక్ష్యంగా లేదా నిరాసక్తతతో చేయమని కాదు. దానికి భిన్నంగా అనగా, ప్రభువునకు వలె హృదయపూర్వకంగా, ఖచ్చితంగా, చక్కగా చేసి క్రైస్తవ సాక్ష్యాన్ని నిలబెట్టాలి. దేవుని బిడ్డ తన ఉద్యోగ సమయాన్ని, తన యజమానికి కేటాయించబడిన సమయాన్ని పూర్తిగా ఇవ్వాలి. విధి నిర్వహణలో ఉన్నపుడు ఉద్యోగ సమయాన్ని దొంగిలించి ఇతరులకు సువార్త చెప్పకూడదు; తన వ్యక్తిగత సమయాన్నే కేటాయించి సువార్తపని చెయ్యాలి.

తన ప్రభువుకు ఇవ్వాల్సిన సమయంలోనికి ఉద్యోగపరమైన యజమాని యొక్క చొరబాటు ఎక్కడ ఆరంభమవుతుందో తెలుసుకోవడం ఒక

క్రైస్తవ విశ్వాసికి తరచూ కష్టమవుతుంది. ఈ విషయంలో సున్నితమైన సమతూకాన్ని ఎక్కువమంది పాటించలేకపోతున్నారు. కాని ఇది మాత్రం నిశ్చయం! ఈ విషయంలో ఒక విశ్వాసి దేవుని ఘనపరచినట్లైతే, దేవుడు అతన్ని ఘనపరుస్తాడు. ఒక వేళ అవసరాన్ని బట్టి ఉద్యోగం మార్చవలసి వచ్చినా అతన్ని మాత్రము దేవుడు విడువడు, భిక్షమెత్తుకొననీయడు.

9. రక్షణ పొందనివారు సహా చక్కగా చేయగలిగినవాటి కోసం ఒక విశ్వాసి తన జీవితాన్ని వెచ్చించడమే శోచనీయమైన విషయం. "మృతులను మృతులే పాతిపెట్టుకొననిమ్ము" అని యేసు ప్రభువు చెప్పాడు (లూకా 9:60). చనిపోయిన వారిని ఎవరైనా పాతిపెట్టవచ్చు, కాని క్రీస్తు కృపను గూర్చి విమోచింపబడిన పెదవులు మాత్రమే సాక్ష్యమివ్వగలవు. అలా అయితే మనము అత్యవసరమైన వారముగా ఉండాలి.

10. మనము ఏ సమయంలోనైనా దుర్లాభాపేక్షతో పనిచేయకూడదు. సంఘానికి ఇవ్వవలసినది ఇవ్వకుండ కార్పోరేషన్‌కు సమర్పించ కూడదు.

11. ఒక వ్యక్తి తన విధిని నమ్మకంగా నిర్వహిస్తూ, దేవుని కొరకై కొద్దిగా వాడబడుతుంటే, ప్రభువు ఆ వ్యక్తియొక్క సేవా పరిధిని విస్తరింప జేస్తాడు. బహుశ అతని సమయం అధికంగా ప్రభువు పనిలో వాడబడుతుండగా అతని దైనందిన అవసరతలు కూడ తీర్చబడుతుండవచ్చు. లేదా సువార్త ప్రకటించుటకు, వాక్యమును బోధించుటకు ఓ స్పష్టమైన, పొరబడని పిలుపును పొందవచ్చును. ప్రభువు స్పష్టంగా నడిపించిన సందర్భాల్లో, నా భౌతిక అవసరాలు తీర్చబడతాయన్న అభయంతో నిశ్చింతగా ముందుకు వెళ్ళవచ్చు. దేవుడు పిలిస్తే, ఆయన పోషిస్తాడు, లేదా హడ్సన్ టేలర్ చెప్పినట్లు, "దేవుని విధానంలో చేసే దేవుని పనికి దేవుని వనరుల కొరత ఎన్నడూ ఉండదు".

12. వృత్తి, వ్యాపార రంగాల్లో విజయం గురించి అతిశయించే యుగంలో, క్రైస్తవుడు అటువంటివాటిని పెద్దగా పట్టించుకోకపోవడం మంచిది. ఓ పెద్ద సంస్థకు నాయకుడవటం కంటే దీనముగా క్రీస్తును సేవించటం

మంచిది. దేవుని చిత్తంలో లేకుండ అమెరికా దేశానికి అధ్యక్షుడు కావడం కన్నా దేవుని చిత్తంలో ఉండి పాకీపని చేసుకోవడం మంచిది. యౌవన క్రైస్తవులు తమ విద్యా ఉద్యోగాల గురించి ఆలోచించేటప్పుడు ఇటువంటి సంగతులను పరిగణలోనికి తీసుకోవడం మంచిది. తను చేసే ఏ పని అయినా దేవుడే తనను ఆ పనిలో నియమించాడన్న ఖచ్చితమైన నిశ్చయత అతనికి ఉండాలి. అంతేగాని తన ప్రభువు, యజమానికి సంపూర్తిగా లోబడకుండ తప్పించుకునేందుకే ఫలానా పని చేపట్టాను అనుకోవడానికి వీల్లేదు.

# సాకులు, నాటకాలు, నెపములు

క్రీస్తు ఎవరినైనా పిలిచి, ఆదేశించినప్పుడు సాధారణంగా వారు సాకులు చెప్పి తప్పించుకుంటారు. "నేను బ్రతకాలి కదా?" అనే సాకును మనమిదివరకే చూశాం. రక్షకుని పిలుపును "తిరస్కరించే" మరిన్ని సాకులు ఎలావుంటాయో క్లుప్తంగా గమనిద్దాం.

"నేను నా భవిష్యత్ గురించి ఆలోచించాలి!" ఇది సర్వసాధారణ నెపం.

కొన్నేళ్ల క్రితం, ఒక యౌవనస్థుడు ఓ ప్రత్యేకమైన సేవ నిమిత్తము తన జీవితాన్ని ప్రభువుకు ప్రతిష్టించుకోవాలని గొప్పభారం కలిగియుండేవాడు. తనలో గాఢమైన వాంఛ, తీవ్రత ఉన్నట్లు గుర్తించాడు. ఈ సేవా మార్గాన్ని ఎన్నుకోవాలా? లేక వ్యాపారంలో ఉన్నతస్థాయిని కాపాడుకుంటూ ముందుకు వెళ్ళాలా అని రెండింటిని బేరీజు వేస్తూ ఎటు తోచకయుండి ఆ విషయమై సలహా కోరి అనుభవజ్ఞులైన ఇద్దరు క్రైస్తవ పెద్దలను ఆశ్రయించాడు. వారిరువురు వారి వృత్తియందు చక్కగా రాణించినవారే. అతడు ఆ ఉద్యోగాన్ని వదులుకోకుండ నివారించాలన్న ఉద్దేశంతో "బాబ్, నీ భవిష్యత్‌ను కూడ ఆలోచించుకోవాలి" అని గట్టిగా సలహా చెప్పారు. అతడు తన మంచి జీతమున్న ఉద్యోగాన్ని వదులుకోలేదు- కాని *నిజంగా అతడు తన భవిష్యత్ గురించి ఆలోచించాడంటారా?*

"కాని ఎవరో ఒకరు స్వదేశంలో ఉండాలి కదా?" అనేవాళ్లు మరి కొందరుంటారు. ఇటువంటి వారు మిషన్ ఫీల్డ్‌లో శ్రమపడుతున్నవారి పట్ల ఎంతో శ్రద్ధజూపుతున్నట్లు కనిపిస్తారు. కాని చాలాసార్లు వారు అలాంటి పిలుపు తమకు ఎక్కడ వస్తుందోనన్న భయంతోనే అలా అంటున్నట్లు వారి వైఖరి వల్ల స్పష్టంగా తెలుస్తుంది.

వాస్తవమే, సువార్త పని నిమిత్తమై ముందుకు వెళ్ళిన వారిని పోషించడం కోసం దేవుడు కొందరిని స్వదేశంలోనే ఉపయోగించుకుంటాడు. కాని బలహీనులు, పిరికివారైన సహోదరీలు ప్రమాదకర వ్యాధిగ్రస్తమైన స్థలాలకు వెళ్తుంటే, ఆరోగ్యవంతులైయుండి, తలాంతులు కలిగి, ధైర్యవంతులైన వారు ఎంతోమంది ఇంటిపట్టున ఉండిపోవడమే కాస్త విడ్డూరంగా అనిపిస్తుంది.

"క్రైస్తవ సేవలో" గాక బయట అయితే వారి తలాంతులు లేదా వారి విద్యను అధికంగా వాడవచ్చును అనేది బహుశ మరొక కారణం కావచ్చు; వారి స్థాయికంటే తక్కువ పనికి ప్రభువు పిలుస్తాడేమో అని భయపడి, తమ జీవితాన్ని ప్రభువుకు పూర్తిగా సమర్పించరు. దీనికి జవాబు చాలా సులువు: మన తలాంతులు ఎక్కడ బాగా వాడబడతాయో నిర్ణయించటం మన పని కాదు. మనకున్నది ఆయనకు పూర్తిగా ఉపయోగపడదు అనటం ఒకవిధంగా దేవుని అవమానపరచటమే అవుతుంది. మనకున్న సమస్తమును ఆయననుండే పొందుకున్నాము. విద్య, తలాంతులు వాటి స్థానంలో ఉండగా, వాటికి మేలైన స్థలం ప్రభువు యొక్క గాయపడిన ప్రక్కనొద్ద ఉంచుటయే. అపొస్తలుడైన పౌలు విచిత్రమైన తలాంతులు గల ఓ మేధావి. ప్రపంచం దృష్టిలో ఎంతో గొప్పవిగా భావించబడువాటి గురించి అతడు ఈక్రింది విధంగా వ్రాశాడు:

> అయినను ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటన్నిటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అతిశ్రేష్టమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను (ఫిలిప్పీ 3:7,8).

క్రీస్తుకు పూర్ణముగా లోబడే విషయంలో కొందరు "నాకు వయసై పోయిందిగా" అంటారు. అయితే ఈ ఆత్మీయ పనిదొంగలను మనమీ ప్రశ్న అడగాలి: "మీరు నిజంగా విధేయత చూపలేనంత ముసలివాళ్లయ్యారా?

"నాకు ఇంట్లో బాధ్యతలున్నాయి" అనేది మరొక సాకు. తలిదండ్రుల్ని, లేదా భార్యాపిల్లల్ని చూసుకోవాలన్న మాట! మనమాయనకు సమర్పించుకో కుండ ఉండటానికే ఈ ప్రియులను దేవుడు మనకిచ్చాడనటంలో ఏమైనా న్యాయమున్నదా? ఆయన ఈ విధంగా తన సంకల్పాలను, అభిరుచులను

భంగపరుస్తాడా? చేయడు, ఇంటిలో న్యాయబద్ధమైన బాధ్యతలను విస్మరించమని ప్రతిష్ఠితులగు క్రైస్తవులను దేవుడు కోరడు. కాని "తల్లి తండ్రి, భార్యాపిల్లలు, సహోదర సహోదరీలకంటే, ఆఖరుకు నీ సొంత ప్రాణంకంటే కూడ ఎక్కువగా" ఆయన్ని ప్రేమించి ఆయనకు లోబడటమే ప్రధానం (లూకా 14:26).

కొంతమంది యథార్థవంతులైన క్రైస్తవులు తాము తలాంతులు గలవారము కాదని భావించి సంపూర్ణ సమర్పణ చేయుటకు వెనుకాడతారు. విధేయత చూపడానికి తలాంతులుగలవాడే కానవసరం లేదు. క్రీస్తు ఖాళీగా ఉన్న పాత్రలతోనే చక్కగా పనిచేయగలడు. అంతేగాక, ప్రభువు పనికైన ప్రతి పిలుపులో మానవ అయిష్టత ఉన్నట్లు కనిపిస్తుంది. గనుక ఈ వైఖరి ప్రతికూలమైనది కాదు. క్రీస్తు శరీరంలోని ప్రతి సభ్యునికీ ఏదో ఒక వరం ఉంటుంది. దానిని కనుగొనేందుకు గాను యేసు దేవుడని ఒప్పుకోవాలి.

బహుశ అన్నిటిలో కెల్ల అతి దయనీయమైన సాకు ఇదే కావచ్చు: "ఆయన నిమిత్తమై అన్నీ పరిత్యజించాలని దేవుడు నిజంగా కోరడు; అలా పరిత్యజించడానికి నేను సుముఖంగా ఉన్నానో లేదో తెలుసుకోవడమే ఆయన ఉద్దేశం." యుద్ధభూమిలో ముందు వరుసకు దగ్గరలో ఉన్న సైనిక పటాలాన్ని ఒక్కసారి ఊహించుకోండి. ముందుకు సాగమని ఆదేశాలు ఇవ్వబడినప్పుడు సైనికులు సొరంగంలో కూర్చొని, తుపాకులను తుడుచుకుంటూ "మన నిజంగా ముందుకు సాగాలని కాదు; కేవలం మనం ముందుకు సాగడానికి ఇష్టపడుతున్నది లేనిది తెలుసుకోవడమే మన సైన్యాధ్యక్షుడి ఉద్దేశం" అంటూ ముచ్చటించుకొంటుంటే ఎలా ఉంటుంది? ఆ విధంగా ఏ యుద్ధంలోనూ గెలువలేరు, కేవలం ఓటమే వారి చరిత్రగా లిఖించబడుతుంది.

మనుష్యులు తమను తాము క్రీస్తుకు సమర్పించుకొనకపోవడానికి ఇచ్చే సాకులివి. అవి సాకులే గాని కారణాలు కాదు. రక్షకుని కోసం గొప్ప సమర్పణ చేయకపోవడానికి ఎటువంటి కారణమూ లేదు.

"నా కుమారుడా (నా కుమారీ), నీ హృదయమును నాకిమ్ము" నీవాయన కేమిస్తావు?

*సాకునా? లేక నిన్ను నీవే సమర్పించుకుంటావా?*

# తీవ్ర వాంఛతో కూడిన జీవితం

ప్రభువైన యేసుక్రీస్తు దేనికైనా యోగ్యుడైయుంటే, ఆయన సమస్తమునకు యోగ్యుడే! ఆయన మనకొరకు మరణించివుంటే మనము ఆయన కొరకు మరణించాలి! ఆయన మనకొరకు తన శరీరమును అర్పిస్తే గనుక మనము మన శరీరాలను ఆయనకై అర్పించాలి!

నిజ క్రైస్తవుడు నిజంగానే ఓ ఛాందసవాదిలా కనిపిస్తాడు. అతడు అవమానము అవహేళనలకు లక్ష్యంగా మారుతుంటాడు. లోకంతో అతడు మమేకం కాడు, తన చుట్టూ ఉన్న పరిస్థితులతో సర్దుకుపోలేడు. అతడు అందరికీ "పరిచయస్తుడు" అయ్యేలోపు తన వాస్తవ గుణాన్ని పోగొట్టుకున్నాడు.

ఆదర్శ విశ్వాసి ప్రభువుకొరకు ప్రగాఢ వాంఛ కలిగి జీవిస్తాడు. అతడు యేసు క్రీస్తు కొరకు మండుతూ ఉంటాడు. "నాకొక గాఢమైన వాంఛ ఉంది: ఆయనే, ఆయన తప్ప మరేమీ కాదు" అని చెప్పిన కౌంట్ జింజెన్‌డార్ఫ్‌వలె ఉంటాడు. తక్కినదంతా అప్రధానమే.

దేవుని కోసం చేసే ఏ త్యాగమూ గొప్పది కాదని దేవుని ప్రజలు భావిస్తారు. వారి డబ్బు, వారి సమయం, వారి జీవితాలు ఆయన నిమిత్తమే ఉన్నవని వారు సంతోషిస్తారు.

రాబర్ట్ అర్థింగ్‌టన్ వలె వారు కూడ "నేలను నా పడక గాను, ఒక పెట్టెను నా కుర్చీగాను మరొక పెట్టెను నా టేబుల్ గాను చేసికొని సంతోషంగా జీవించగలను కాని, క్రీస్తును గూర్చిన జ్ఞానము లేక మనుష్యులు నశించుట నాకిష్టం లేదు" అంటారు.

ఒక విధంగా చూస్తే, ఆయన శిష్యులు అసహజంగా ఉంటారు. వారి సహజ ప్రేరణలకు భిన్నంగా ప్రవర్తిస్తారు. సాధారణ జీవితంతో వారు తమ

బంధాలను తెగతెంపులు చేసుకుంటారు. ఇవి పరాధీనము చేయరాని హక్కులని కొందరు వేటినైతే భావిస్తారో వాటిని క్రీస్తు నిమిత్తమై వారు తృణప్రాయంగా ఎంచుతారు. ఆయన అనుచరులు కట్టుబానిసలు. వారు శాసించాలనుకోరు, కేవలం విధేయులవుతారు.

భక్తిగల క్రైస్తవుడు ఒక కొత్త ప్రాంతంలో వింతైన దృశ్యాన్ని చూస్తూ వెళ్లే యాత్రికుడు, పరదేశి వంటివాడు. అక్కడి నివాసులకు అతడు నమ్మకంగా సువార్త ప్రకటిస్తూ వెళతాడే తప్ప, ఈ లోక మర్యాదలలో వేటినీ అనుసరించడు.

ఇహలోక స్నేహం చేయాలన్న పట్టింపు లేనివాడు, లోకసంబంధమైన మేళ్లను ఆశించనివాడు, నష్టపోతానేమో నన్న భయంలేనివాడు, జీవితాన్ని గురించిన చింత, ప్రాణభీతి లేనివాడు; హోదా, స్థితి, దేశము ఇవేవి అతని పటింపునకు రావు. క్రీస్తు సువార్తే అతని ఆలోచన, దేవుని మహిమే అతని ధ్యేయం. క్రీస్తు నిమిత్తమై మూర్ఖుడుగా ఎంచబడినా సంతోషిస్తాడు. అత్యుత్సాహి, వదరుబోతు, చాందసవాది లేక వింతమనిషి అని లోకం అతనికి ఏ పేరైనా పెట్టనీ. అతడు అనామకునిగానే ఉండనివ్వండి. వారు అతన్ని వ్యాపారి, పౌరుడు, ఇంట్లో ఉండువాడు, జ్ఞాని, విజ్ఞతగలవాడు అని పిలిచినా అవన్నీ అతని పాత స్వభావంతో అంతరించినవే. వారు మాట్లాడనైనా మాట్లాడాలి లేదా మరణించాలి; మరణించవలసి వచ్చినా వారు సువార్తను ప్రకటిస్తారు. వారికి విశ్రాంతి లేదు. వారు కొండలు, కోనలు, అరణ్యాలు, అడవులు, నదులు, లోయలు దాటి వెళ్ళి క్రీస్తు సువార్తను త్వరపడి చాటుతారు. వారు అరచినా, ప్రాణాపాయము వచ్చినా నిరాటంకముగా సువార్త నిమిత్తమై సాగిపోతారు. చెఱలో ఎలుగెత్తి చాటుతారు, సముద్ర తరంగాలెదురైనా మౌనంగా ఉండక ప్రకటిస్తారు. సింహాసనముల ఎదుట, సభలలో సత్య ప్రకటన చేస్తారు. మరణము తప్ప మరేదీ వారిని అడ్డుకొనలేదు. మరణ శాసనము ఎదురైనా, అగ్ని మంటలు వారిని అలుముకొనినా, మంటలు వారిని దహించి వేస్తున్నా, వారు మాట్లాడతారు, ప్రార్థిస్తారు, క్రీస్తే ప్రభువని ఒప్పుకొంటారు, పాడి స్తుతిస్తారు, హింసించు వారికొరకై ప్రార్థించి వారిని దీవిస్తారు.

నేటి కొరకు ప్రభువైన యేసు చూస్తున్నది అట్టి స్త్రీపురుషుల కోసమే.

గురిలేక గుంపులో ఒకనిగా పరుగెత్తువారి కోసం గాక వారికంటే ముందుగా తాను పరిత్యజించి నడచి చూపిన దారిలో నడిచేందుకు ఇష్టపడు వారిని మరియు అమరణ దీక్షతో తన్ను వెంబడించు స్త్రీ, పురుషులను ఆయన కోరుతున్నాడు.

"తన హృదయంలో నుండి మాటలు బడబాగ్నిలా వెలువడిన" రోలండ్ హిల్‌లాంటి మనుష్యులు కావాలి ప్రభువుకు. ఆత్మలకొరకై దాహముగొన్న చాల్మర్స్ లాంటి వ్యక్తులను ప్రభువు కోరుతున్నాడు. "ఇక నన్ను దేవుని కొరకు దహించబడనివ్వండి" అని చెప్పిన హెన్రీ మార్టిన్‌లాంటి మనుష్యులు ఆయనకు కావాలి.

నేటిరోజున చాలా మంది యౌవనస్థులు వారి శ్రేష్టమైన వయస్సును వ్యాపారంకోసం వెచ్చించడానికి ఇష్టపడుతున్నారు. తమ దేశంకోసం ప్రాణాలర్పించడానికి ఇష్టపడుతున్నారు. మంచి జీతం దొరికితే ప్రపంచమంతా చుట్టిరావడానికి సిద్ధంగా ఉన్నారు. ఓ రాజకీయ పార్టీకోసం రేయింబగళ్లు పనిచేస్తారు.

సంగీతకారులయ్యేందుకు వారు తమచేతి వ్రేళ్లు అరిగిపోయేలా సాధన చేస్తారు. మతకన్యలుగానో మతగురువులుగానో మారేందుకు ఆజన్మ బ్రహ్మచారులుగా ఉండిపోతామని భీకర ప్రతిజ్ఞ చేస్తారు. నటీనటులయ్యేందుకు పెద్ద పెద్ద డైలాగులు సహా కంఠత పెట్టేస్తారు. కోరుకున్న వృత్తిని చేపట్టేందుకు పదిసంవత్సరాలైనా కష్టపడి చదువుతారు.

ప్రభువైన యేసు నిమిత్తం నీవు ఏం చెయ్యటానికి ఇష్టపడుతున్నావ్? నీ హృదయంలో ఏదో కొంత భాగాన్ని, లేక సగభాగాన్ని కాదు; **సమస్తమును** ఆయనకు ఇస్తావా?